
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 24 అక్టోబరు 2025



ఐటీకి విశ్వ నగరంగా విశాఖ
- ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర
- కూర్మన్నపాలెంలో మద్యం సురక్ష యాప్‌పై విస్తృత ప్రచారం

- వివరాలు 8లో



ఉక్కులో తొలగింపులు

నాలుగు రోజుల క్రితం 500 మంది కాంట్రాక్టు వర్కర్లు నిలిపివేత

మరో 1,000 మందిని పక్కన పెట్టడానికి ప్రణాళిక

- ప్రజా ప్రతినిధుల విన్నపాలు బుట్టదాఖలు
- డిసెంబరు 31కి ప్లాంటులో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు 15 వేల మందే ఉండాలని లక్ష్యం



విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు వర్కర్ల తొలగింపు చర్యలు కొనసాగుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా వందలాది మందిని బయటకు పంపుతున్నారు. నాలుగు రోజుల క్రితం 500 మంది కాంట్రాక్టు వర్కర్లను తొలగించారు. మరో వేయి మందిని తొలగించడానికి ప్రణాళిక రూపొందించారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఇచ్చిన లక్ష్యం ప్రకారం ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి ఉద్యోగుల సంఖ్య 7,500, కాంట్రాక్టు వర్కర్ల సంఖ్య 7,500 మాత్రమే ఉండాలి. మొత్తం 15 వేలకు మించి ఉన్నవారిని బయటకు పంపాలి. ఆ ఆదేశానికి అనుగుణంగా యాజమాన్యం దశల వారీగా చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం ఉద్యోగులు 9,500 మంది, కాంట్రాక్టు వర్కర్లు 8,500 మంది కలిపి 18 వేల మంది ఉన్నారు. ప్లాంటులో చిన్న చిన్న కాంట్రాక్టర్లు అందరినీ తొలగించి, పెద్ద కాంట్రాక్టర్లకు గుత్తగా విభాగాలను అప్పగించే ప్రక్రియకు రెండు నెలల క్రితం ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (ఈఓఐ) ఇచ్చిన సంగతి తెలిసిందే. మొత్తం 32 విభాగాలను నిర్వహించడానికి టెండర్లు పిలిచారు. ఆ ప్రక్రియ పూర్తయి కొత్త కాంట్రాక్టర్లు వచ్చేసరికి ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు వర్కర్ల సంఖ్యను 7,500కు తీసుకురావాలి. దానికి అనుగుణంగా వారిని తగ్గిస్తున్నారు.

విభాగాల మార్పుతో రాజీనామాలు

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత యాజమాన్యం వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటోంది. కొన్ని దశాబ్దాలుగా ఒకే విభాగంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులను తీసుకువెళ్లి సంబంధం లేని వేరే విభాగాల్లో పనులు చేయాలని చెబుతోంది. అక్కడ పెద్ద పెద్ద లక్ష్యాలు ఇస్తున్నారు. వాటిని విభాగాధిపతులు సాధించలేకపోతున్నారు. దాంతో వారిపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఇవన్నీ అనారోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. దాంతో చాలా మంది విభాగాధిపతి రాజీనామా చేసి వెళ్లిపోతున్నారు. వీఆర్ఎస్ తీసుకోకుండా ఉండిపోయిన వారిని ఇలా పొగ పెట్టి బయటకు పంపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఆధార్ కార్డుల బ్లాకింగ్

కాంట్రాక్టు వర్కర్ల తొలగింపు పేరుతో 300 మంది వరకు నిర్వాసితులను పక్కనపెట్టారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కొత్తగా తీసుకునే వారిలో నిర్వాసితులకే ప్రాధాన్యం ఇవ్వాలని విశాఖ ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాజమాన్యాన్ని కోరుతున్నారు. పరిశీలిస్తామని చెబుతున్నారే తప్ప ఐదు నెలలైనా తొలగించిన వారిని తిరిగి తీసుకోలేదు. పైగా తొలగించిన వర్కర్లకు ఇంకెక్కడా పని దొరక్కుండా వారి ఆధార్ కార్డులను కాంట్రాక్టర్ల పోర్టల్‌లో బ్లాక్ చేసేశారు. దాంతో కొత్త కాంట్రాక్టర్ల వద్ద వారు పనిలో చేరే అవకాశం లేకుండా పోయింది. ఇది అన్యాయమని, వెంటనే ఆధార్ కార్డులను అన్‌బ్లాకింగ్ చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నా యాజమాన్యం స్పందించడం లేదు.

మరో విభాగం నిర్వహణ ప్రైవేటుకు...

- రూ.98 కోట్లతో సింటర్ ప్లాంటు-1కు టెండర్
- అక్కడ పనిచేస్తున్న 330 మంది కాంట్రాక్టు వర్కర్ల తొలగింపు?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ తయారీలో అత్యంత కీలకమైన విభాగం నిర్వహణ బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించేందుకు స్టీల్ ప్లాంటు ప్రకటన జారీచేసింది. వ్యయం తగ్గింపు, ఉద్యోగులు, కార్మికుల కుదింపు, 90 శాతానికి పైగా ఉత్పత్తి సాధన లక్ష్యాలతో ముందుకు వెళుతున్న యాజమాన్యం తాజాగా సింటర్ ప్లాంటు-1 టెక్నికల్ మేనేజ్‌మెంట్, మెయింటెనెన్స్‌కు ఆసక్తి కలిగిన వారు ముందుకు రావాలంటూ ప్రకటించింది. రెండేళ్ల నిర్వహణకుగాను రూ.98 కోట్లు ఇస్తామని పేర్కొంది. స్టీల్ తయారీలో సింటర్ చాలా కీలకం. బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్)లో నేరుగా ముడి పదార్థాలు వేస్తే ఫర్నేస్ పాడైపోతుందని ముందుగా 'సింటర్' తయారుచేస్తారు. దానిని బ్లాస్ట్‌ఫర్నేస్‌లో ఉపయోగిస్తారు. స్టీల్ ప్లాంటులో రెండు సింటర్ ప్లాంట్లు ఉన్నాయి. మూడు బ్లాస్ట్ ఫర్నేసులకు అవసరమైన సింటర్ మొత్తం ఈ రెండింటి నుంచే పంపుతారు.

సింటర్ అంటే..

స్టీల్ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు ఐరన్ ఓర్, ఫైన్ కోక్, లైమ్ స్టోన్‌లను నిర్ణీత నిష్పత్తిలో కలిపి ద్రవరూపంలోకి మారే ఉష్ణోగ్రత వద్ద మండిస్తారు. ఆ ప్రక్రియలో చిన్నచిన్న రంధ్రాలు కలిగిన రాళ్ల మాదిరి పదార్థం తయారవుతుంది. దానినే 'సింటర్' అంటారు. ఈ సింటర్‌నే బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉపయోగిస్తారు. సింటర్ ప్లాంటు-1లో సమారు 330 మంది కాంట్రాక్టు వర్కర్లు పనిచేస్తున్నారు. ఈ విభాగాన్ని ప్రైవేటుకు అప్పగిస్తే వారందరినీ తొలగిస్తారు.

ఆర్ఎంహెచ్‌పీ నుంచి మెటీరియల్ తెచ్చుకోవాలి

రా మెటీరియల్ హ్యాండ్లింగ్... మిగతా 6వ పేజీలో

రోడ్డుపై చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా

గెడ్డల్లో కూడా వేయకూడదు

- దుకాణాల వద్ద డస్ట్ బిన్‌లు ఏర్పాటుచేయని వ్యాపారులకు కూడా...
- డ్రోన్‌ల ద్వారా రోడ్లపై ఉండే చెత్తగుర్తింపు
- తక్షణం తొలగించేలా సంబంధిత పారిశుధ్య సిబ్బందికి సమాచారం
- వన్‌టౌన్ నుంచి శ్రీకారం చుట్టిన జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



పూర్ణామార్కెట్ నుంచి టౌన్‌కొత్తరోడ్డుకి వెళ్లే రోడ్డులో డ్రోన్ ద్వారా రికార్డుచేసిన దృశ్యాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ప్రజలు, వ్యాపారులు చెత్తను రోడ్లపై, గెడ్డల్లో పడేయకుండా చూడాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నిర్ణయించారు. ఇందుకోసం డ్రోన్‌ల సహాయం తీసుకోనున్నారు. బాధ్యత లేకుండా రోడ్లపై చెత్తను పడేసిన వారికి రూ.వెయ్యి జరిమానా విధించనున్నారు. దీనికోసం పూర్ణామార్కెట్ నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు బుధవారం రాత్రి డ్రోన్‌తో సర్వే నిర్వహించారు.

నగరంలో ఎక్కడచూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. కొందరు తమ ఇళ్లలోని చెత్తను తీసుకొచ్చి రోడ్లపై, గెడ్డల్లోనూ పడేస్తున్నారు. అలాగే వ్యాపారులు తమ దుకాణాల ముందు డస్ట్ బిన్‌లను పెట్టకపోవడంతో వినియోగదారులు చెత్తను రోడ్డుపైనే పడేసి వెళ్లిపోతున్నారు. దీని వల్ల రోడ్లన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది ఎంతగా శ్రమించినాసరే ఆశించిన ఫలితం ఉండడం లేదు. దీంతో కమిషనర్ కేతన్‌గార్గ్ వినూత్నంగా ఆలోచించారు. జీవీఎంసీ పరిధిలో ఒక డ్రోన్ ఆపరేటర్‌ను తాత్కాలిక ప్రాతిపదికన విధుల్లోకి తీసుకున్నందున అతని సేవలను రోడ్లను పరిశుభ్రంగా మార్చేందుకు వాడుకోవాలని నిర్ణయించారు. కోర్ సిటీ ప్రాంతంలోని జోన్-3, జోన్-4, జోన్-5 పరిధిలో గల ప్రధానరోడ్లు, గెడ్డలపై డ్రోన్‌తో ప్రతిరోజూ నిఘా పెట్టడం, సర్వే నిర్వహించడం చేయాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌తో పాటు ఆయా జోన్ల కమిషనర్లను ఆదేశించారు. డ్రోన్‌ను ప్రధాన రోడ్లు, ప్రాంతాల్లో ఎగురవేసినప్పుడు వీడియో లింక్‌ను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఇవ్వాలని సూచించారు. ఆ లింక్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిబ్బంది డ్రోన్ వెళ్లే మార్గంలో ఎక్కడెక్కడ చెత్త ఉందో గుర్తించి, ఆ ప్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటరీ సెక్రటరీలతోపాటు జోన్ కమిషనర్, ఏఎంహెచ్‌ఓలకు సమాచారం అందిస్తారు. వారంతా ఆ మార్గంలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బంది ద్వారా రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటారు. అలాగే డ్రోన్ వీడియోలో దుకాణాలు ముందు ఎక్కడైనా చెత్త కనిపిస్తే ఆ దుకాణ యజమానికి రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. అలాగే ఎవరైనా చెత్తను తమ ఇంటికి వచ్చే వాహనానికి అందజేయకుండా రోడ్డుపైగానీ, గెడ్డలోగానీ పడేస్తున్నట్టు డ్రోన్ వీడియోలో గుర్తిస్తే వారికి కూడా రూ.వెయ్యి జరిమానా విధించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ విధానంలో లోటుపాట్లను తెలుసుకునేందుకు బుధవారం రాత్రి పూర్ణామార్కెట్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు జంక్షన్ వరకూ రోడ్డుపై డ్రోన్‌ను ఎగురవేశారు. స్వయంగా ... మిగతా 6వ పేజీలో

దఫదఫాలుగా వర్షం

పద్మనాభంలో 28.5 మి.మీ. నమోదు



అక్కయ్యపాలెం వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి వర్షం

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి వస్తున్న తేమగాలుల ప్రభావంతో నగరం, పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి దఫదఫాలుగా వర్షం కురుస్తూనే ఉంది. బుధవారం రాత్రి దక్షిణ కోస్తాలో తీరం దాటి కర్ణాటక వైపు పయనించిన అల్పపీడనం దిశగా సముద్రం నుంచి భారీగా తేమగాలులు వీస్తున్నాయి. దీంతో గురువారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. పద్మనాభంలో 28.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, రైల్వేన్యూకాలనీ, సీతమ్మధార ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. శుక్రవారం నుంచి వచ్చే ఐదారు రోజుల వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

పెట్టుబడుల సదస్సుకు భారీ ఏర్పాట్లు

- 30 దేశాల నుంచి ప్రతినిధులు
- దేశంలో పలు రాష్ట్రాల నుంచి వందలాది మంది పారిశ్రామికవేత్తల రాక
- 26 హోటళ్లల్లో 1,200 గదులు బుకింగ్
- వచ్చే నెల 14, 15 తేదీల్లో సదస్సు
- 13వ తేదీ రాత్రి అతిథులకు సీఎం విందు



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి వెళ్లే మార్గంలో వాల్ పెయింటింగ్

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో వచ్చే నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లుచేస్తోంది. సదస్సులో పాల్గొనాలని పలు దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలకు ఇప్పటికే ఆహ్వానాలు పంపింది. ఇందుకోసమే సీఎం చంద్రబాబునాయుడు దుబాయ్‌లో, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు.

మరోవైపు సదస్సుకు హాజరయ్యే పారిశ్రామికవేత్తలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర స్థాయిలో మంత్రులు, ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించారు. అలాగే సదస్సు నిర్వహణ, వేదిక నిర్మాణం, అతిథులకు వసతి, రవాణా సదుపాయాల కోసం జిల్లా అధికారులతో కమిటీలు వేశారు. అన్ని శాఖల సిబ్బందికి విధులు అప్పగించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో వేదిక నిర్మిస్తున్నారు. ప్రధాన వేదికతోపాటు రెండు సెమినార్ హాళ్లు ఇక్కడ ఏర్పాటుచేస్తున్నారు. సీఎం, కేంద్ర వాణిజ్య శాఖా మంత్రుల కోసం రెండు క్యాబిన్‌లు నిర్మిస్తారు. సుమారు 30 దేశాల ... మిగతా 6వ పేజీలో

బీఈడీ కాలేజీల ఇష్టారాజ్యం

- కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు
- ఏయూ పరిధిలోని అనేక కాలేజీల్లో అడ్డగోలు వైఖరి
- ఫీజులు చెల్లించని వారికి తీవ్ర వేధింపులు



విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. కన్వీనర్ కోటాలో సీట్లు దక్కించుకుని కాలేజీలో చేరేందుకు వెళుతున్న విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. సాధారణంగా ఎడ్‌సెట్ రాసి సీట్లు దక్కించుకున్న విద్యార్థులు రూపాయి కూడా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, అందుకు విరుద్ధంగా అనేక కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. దీనిపై విద్యార్థులు ప్రశ్నిస్తున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. అడ్మిషన్స్ సమయంలో అడ్డగోలు వసూళ్లకు పాల్పడే కాలేజీలను నియంత్రించే బాధ్యతను ఏయూ అధికారులు తీసుకోవాలి. అవసరమైతే హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తేవాలి. అయితే, ఈ తరహా ఏర్పాట్లను చేయకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఫీజు చెల్లిస్తేనే చేరే చాన్స్..

ఎడ్‌సెట్‌లో ర్యాంకులు సాధించి వర్సిటీ పరిధిలోని కాలేజీల్లో పలువురు విద్యార్థులు సీట్లు దక్కించుకున్నారు. వారంతా కాలేజీలకు వెళ్లగా యాజమాన్యాలు ఒక్కో విద్యార్థి వద్ద రూ.10 వేల నుంచి రూ.26 వేల వరకు వసూలు చేస్తున్నాయి. కొన్ని కాలేజీలు ఒకేసారి మొత్తం చెల్లించాలని కోరుతుండగా, మరికొన్ని రెండు, మూడు వాయిదాలు ఇచ్చాయి. ముందుగా ఫీజు చెల్లిస్తేనే కాలేజీల్లో చేరే అవకాశాన్ని ... మిగతా 6వ పేజీలో

చేజేతులా...!

బంపర్ ఆఫర్‌పై ఏయూ అధికారుల నిర్లక్ష్యం

- ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సు నిర్వహణకు అవెంటల్ సంస్థ ప్రతిపాదన
- రెండో ఏడాది నుంచి విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున స్టైపెండ్ ఇస్తామని హామీ
- రూ.9.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగ కల్పనకు సిద్ధం
- గత ఏడాది వర్సిటీ అధికారులతో ఎంవోయూ
- స్పందించని ఏయూ అధికారులు
- ఎంవోయూను రద్దు చేసుకున్న సంస్థ
- తాజాగా గీతం, జేఎన్‌టీయూకేతో ఒప్పందం



విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల తీరు ఎవరికీ అంతుబట్టడం లేదు. మంచి వేతనంతో విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఓ సంస్థ ముందుకువచ్చినా పట్టించుకోలేదు. ఫలితంగా ఆ సంస్థ ప్రత్యామ్నాయం చూసుకుంది. దీంతో ఏయూలో చదువుకుని, ఉన్నత స్థానాలకు చేరాలని అభిలషించే నిరుపేద విద్యార్థులకు సువర్ణావకాశం చేజారింది. ప్రస్తుతం ఈ వ్యవహారం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

సిగ్నల్ ప్రాసెసింగ్ పరికరాలను తయారుచేసే అవెంటల్ కంపెనీ ఏడాది కిందట ఏయూ అధికారుల ఎదుట కీలక ప్రతిపాదన ఉంచింది. వర్సిటీ, ఇండస్ట్రీ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సును నిర్వహించాలని, ఇందుకు తాము సహకరిస్తామని తెలిపింది. పాఠాలు బోధించేందుకు నిపుణులను కూడా నియమిస్తామని, కోర్సులో చేరిన విద్యార్థులందరికీ రెండో ఏడాది ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించి, నెలకు రూ.25 వేల చొప్పున అందిస్తామని కూడా హామీ ఇచ్చింది. కోర్సు పూర్తయిన వెంటనే ఒక్కో విద్యార్థికి రూ.9.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం ఇస్తామని స్పష్టంచేసింది. సంస్థ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఏయూ అధికారులు గత ఏడాది చివర్లో ఎంవోయూ చేసుకున్నారు.

స్పందించని వర్సిటీ యంత్రాంగం

ఒప్పందం మేరకు వర్సిటీ అధికారులు కోర్సు నిర్వహణపై ... మిగతా 6వ పేజీలో

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

- మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అరెస్టు
- దొంగనోట్ల తయారీకి వాడే పరికరాలు, యంత్రాలు స్వాధీనం
- మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు




మీడియా సమావేశంలో నకిలీ నోట్లను చూపిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దొంగనోట్ల ముఠా గుట్టును నగర పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో మధ్యప్రదేశ్‌కు చెందిన కీలక నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి దొంగనోట్ల ప్రింట్‌లు, ల్యాప్‌టాప్, ప్రింటర్‌తోపాటు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మేరీప్రశాంతి వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని బర్వానీ జిల్లా ... మిగతా 6వ పేజీలో

ఈడబ్ల్యూఎస్ ప్లాట్లు

- దాకమర్రి లేఅవుట్‌లో 304 ప్లాట్లు
- లబ్ధిదారులను గుర్తించని యంత్రాంగం
- పుష్కర కాలంగా హోల్డింగ్
- అర్థం కాని వీఎంఆర్‌డీఏ పెద్దల మనసు
- నిర్ణయాధికారం కలెక్టర్‌కు అప్పగించిన బోర్డు



దాకమర్రి లేఅవుట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)ను అధికారులు కరుణించడం లేదు. ప్రభుత్వం గతంలో వారికి ప్రత్యేక లబ్ధి కలిగేలా చర్యలు చేపట్టినా, ఆ తరువాత ఉపసంహరించుకుంది. అయితే అప్పటికే వారి కోసం కేటాయించిన ప్రయోజనాలను అర్హులకు అందించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు.

లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించే రియల్ ఎస్టేట్ సంస్థలన్నీ వాటిలో కొన్నింటిని ఈడబ్ల్యూఎస్ వర్గాలకు కేటాయించి, తక్కువ రేటుకు ఇవ్వాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై రియల్ ఎస్టేట్ సంస్థలు మల్లగుల్లాలు పడ్డాయి. ఖరీదైన లేఅవుట్లు వేస్తామని, అక్కడ ఈడబ్ల్యూఎస్ వర్గాల ఇళ్లుంటే.. పెద్ద ప్లాట్లు కొనడానికి ధనికులు ముందుకురారని వాదించాయి. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు కచ్చితంగా ప్రయోజనం అందాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశించడంతో ... మిగతా 6వ పేజీలో



పారాయణలు చేస్తున్న అధ్యాపకులు

తిరు నక్షత్ర పూజలు ప్రారంభం

సింహాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో విశిష్టాద్వైత మతవ్యాపకులు మనవాళ్ల మహాముసుల తిరు నక్షత్ర పూజలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులు, ఆళ్వార్లను పుష్పమాలికలతో అలంకరించి ఆస్థాన మంపడంలో అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు షోడశోపచారాల పూజలు జరిపారు. అనంతరం అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని నాలుగు వేల పాశురాల పారాయణలను ప్రారంభించి మధ్యాహ్నం రాజభోగం సమయానికి 800 పాశురాలు పూర్తిచేశారు. రాజభోగం వేళ ప్రత్యేక ఆరాధనలు చేసి నివేదనలు సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ర్యాగింగ్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ అప్పలరాజు

తగరపువలస, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగివలస ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల జరిగే నష్టాల గురించి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్త్ జోన్ ఏసీపీ ఎస్. అప్పలరాజు మాట్లాడుతూ సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేయకుండా ప్రేమ పూర్వకంగా ఆహ్వానించాలని చెప్పారు. మంచి స్నేహం, మంచి ఆలోచనలు మాత్రమే జీవితంలో స్థిరపడటానికి దోహదం చేస్తాయన్నారు. డా. భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భీమిలి సీఐ తిరుమలరావు, మహిళా ఎస్ఐ మల్లీశ్వరి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై పశువుల సంచారంతో ఇబ్బందులు



బీఆర్‌టీఎస్ రోడ్డులో అడ్డంగా ఉన్న పశువులు

సింహాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎక్కడికక్కడ పశువుల సంచారం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళ పదుల సంఖ్యలో పశువులు రోడ్డుపై ఉండడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కొన్నిసార్లు వాటి బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారు. పెంపకందారులు రెండు పూటలా వాటిని రోడ్డుపైకి వదిలేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.

అధ్వానంగా సిరత గట్టు రోడ్డు



గోతులతో ఉన్న రహదారి

పద్మనాభం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పాండ్రంగి పంచాయతీ సిరత గట్టు గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రైతు సేవా కేంద్రం నుంచి బోని-ఆనందపురం ప్రధాన రహదారి వరకు ఉన్న రోడ్డు శిథిలం కావడంతో పాదచారులు, వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. రోడ్డు మొత్తం పాడై ఎక్కడికక్కడ గోతులు పడి రాళ్లు తేలాయి. వర్షం పడితే మరింత ఛిద్రంగా తయారవుతోంది. ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

రోడ్డుపై చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ దీనిని పూర్ణామార్కెట్‌రోడ్డు నుంచి పర్యవేక్షించగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిబ్బంది డ్రోన్ వీడియోను విశ్లేషించి ఆ మార్గంలో చెత్త ఎక్కడెక్కడ ఉందనే సమాచారాన్ని సంబంధిత ప్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టర్, జోనల్ కమిషనర్లకు వెంటవెంటనే పంపించారు. దీనివల్ల రోడ్లపై చెత్త కనిపించకుండా చేయవచ్చునని భావించిన కమిషనర్ ఇకపై నిరంతరం దీనిని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై చెత్త పడేసే వారితోపాటు దుకాణాల వద్ద చెత్తను వేసేందుకు డస్ట్ బిన్‌లు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యాపారులకు జరిమానా విధించే బాధ్యతను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు అప్పగించారు. డ్రోన్ ఆపరేటర్ ప్రతిరోజూ ఏదో ఒక జోన్‌కు వెళ్లి ఆ జోన్‌లో ప్రధాన మార్గాలను వీడియో తీయాల్సి ఉంటుంది. దీని గురించి ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, రోడ్లను ఎంత శుభ్రం చేస్తున్నా ప్రజలు, వ్యాపారుల నిర్లక్ష్యం కారణంగా చెత్తమయంగా మారుతున్నాయని, దీనిని అరికట్టేందుకు కొత్త విధానం చాలావరకు సహాయపడుతుందని అన్నారు.

మరో విభాగం నిర్వహణ ప్రైవేటుకు...

... 5వ పేజీ తరువాయి

ప్లాంటులోని బంకర్లలో సింటర్ తయారీకి అవసరమైన ముడి పదార్థాలన్నీ ఉంటాయి. వాటిని సింటర్ ప్లాంటుకు తెప్పించుకొని, సక్రమంగా నిర్వహించుకోవలసిన బాధ్యత కాంట్రాక్టు సంస్థదే. పర్యవేక్షణకు మాత్రం స్టీల్ ప్లాంటు అధికారులను ఉంచుతారు. మిగిలిన ప్రక్రియ మొత్తం ప్రైవేటు సంస్థే చూసుకోవాలి.

బీఈడీ కాలేజీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కల్పిస్తుండడం పట్ల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏయూ పరిధిలో 59 కాలేజీలు

ఏయూ పరిధిలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 59 బీఈడీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో కొన్ని కాలేజీలు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఫీజుల వసూలుపై విద్యార్థులు కొందరు వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు స్పందించి ఇప్పటికే వసూలు చేసిన ఫీజులను తిరిగి చెల్లించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.



గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలతో మురుగు నీరు



గెడ్డకు ఇరువైపులా తుప్పలు

అత్యంత దారుణంగా సుద్దగెడ్డ

- పేరుకుపోయిన వ్యర్థాలు
- ఎక్కడికక్కడే మురుగు నీరు నిల్వ
- తాగునీటి వనరులు కలుషితం

మధురవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసర ప్రాంతంలో ఉన్న సుద్ద గెడ్డ వ్యర్థాలతో నిండిపోతోంది. అధికారులు కొన్నేళ్లుగా గెడ్డ నిర్వహణ పట్టించుకోకపోవడంతో పూడికలు పేరుకుపోయాయి. ఒకప్పుడు మధురవాడ పరిసర ప్రాంతాలకు భూగర్భ జలాలు పుష్కలంగా లభించడానికి ఈ గెడ్డే కారణం. నేడు పూడికలతో పూర్తిగా కుచించుకుపోయింది. మరోవైపు గెడ్డ నిండా వ్యర్థాలు కనిపిస్తున్నాయి. కొంతమంది గెడ్డ పొడవునా భవన నిర్మాణ వ్యర్థాలను కుప్పలుగా వేస్తున్నారు. సుమారు 15 ఏళ్ల కిందట వీఎంఆర్‌డీఏ అధికారులు గెడ్డలో నీరు నిల్వ ఉండటానికి గొలుసు కట్టు మాదిరిగా ఎనిమిది చెక్ డ్యామ్‌లు నిర్మించారు. తరువాత ప్రభుత్వపరంగా గెడ్డ పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో నీరు విపరీతమైన దుర్వాసన వస్తోంది. గెడ్డ పక్కనున్న మిథిలాపురి వుడాకాలనీ, పాత మధురవాడ, వాంబే కాలనీ, పోర్టు కాలనీ, నగరంపాలెం ప్రాంతాలకు భూగర్భ జలాలు గతంలో స్వచ్ఛంగా ఉండేవి. ప్రస్తుతం బోరుబావుల నుంచి వస్తున్న నీరు దుర్వాసన వస్తోంది. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి గెడ్డ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అసంపూర్తిగా సీసీ రోడ్డు పనులు



అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు

సాగర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ సమీపంలోని ఒమ్మివానిపాలెం గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మించిన అధికారులు రహదారి పనులను అసంపూర్తిగా వదిలేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం వరకూ ఈ గ్రామానికి కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేంత మార్గం ఉండేది. ఆటోలు, కార్లు, అంబులెన్స్‌లు వచ్చే పరిస్థితి ఉండేది కాదు.దీనివల్ల అనారోగ్యం బారిన పడిన వారిని ఆస్పత్రులకు తీసుకువెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు పాలకులు, అధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో కల్వర్టు నిర్మించి, మట్టి రోడ్డు వేశారు. అయితే గ్రామంలో ఉన్న సీసీ రోడ్డుకు అనుసంధానం చేస్తూ కల్వర్టు నుంచి సగం వరకు మాత్రమే సీసీ రోడ్డు వేశారు. మిగతా పనులను పూర్తి చేయకపోవడంతో స్థానికులు మట్టి రోడ్డు మీదుగా రాకపోకలు చేయడానికి అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే రోడ్డు బురదమయం కావడంతో నరక యాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఎమ్మెల్యే గంటాకు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ హేమలత

పాఠశాల సమస్యలపై ఎమ్మెల్యే గంటాకు వినతి

కొమ్మాది, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని డంపింగ్ యార్డుకు సమీపంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మౌలిక వసతులు కల్పించాలని కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. గురువారం ఆమె ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేదని, భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, ప్రహరీ నిర్మించాలని విన్నవించారు. అలాగే పాఠశాల స్థలం ఆక్రమణకు గురవ్వకుండా క్రీడా మైదానం అభివృద్ధి చేయాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

'సఖీ సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు, వైద్యులు

భీమునిపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తోటవీధి వార్డు సచివాలయంలో గురువారం సఖీ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ 35 ఏళ్లు దాటిన మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యులు మహిళలకు పలు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్ వన్ ఏపీడీ దొర, సీఓలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో భూములు పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఐజీ విక్రమ్

పద్మనాభం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :కృష్ణాపురం గ్రామంలో సర్వే నెంబరు 1లో ఉన్న భూములను హైదరాబాద్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ ఐజీ టి. విక్రమ్ గురువారం పరిశీలించారు. మండలంలో సీఆర్‌పీఎఫ్ సెక్టారు ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించారు. వారికి కావలసిన 40 ఎకరాలను తహశీల్దారు ఆనందరావు డీజీపీకి చూపించారు.

పద్మనాభం తహశీల్దారుకు ఉద్యోగోన్నతి



తహశీల్దారును అభినందిస్తున్న సిబ్బంది

పద్మనాభం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తహశీల్దారు ఆనందరావుకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.డీటీలు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ఆర్ఐ శ్యామల, కార్యాలయం సిబ్బంది, వీఆర్‌ఓలు ఆయన్ను అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ ఎం. అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేములవలస, ఎల్‌వీపాలెం, ఆనందపురం, బీపీవి కళ్లాలు, సత్యకల్యాణి అపార్టుమెంట్, ఈగలవానిపాలెం, దుక్కవానిపాలెం, మెట్టమీదవానిపాలెం, పాలవలస, గుడిలోవ, వెల్లంకి, పెద్దిపాలెం, పొడుగుపాలెం, కుసులువాడ, జగన్నాథపురం, చందక, వెంకటాపురం, గొట్టిపల్లి, తర్లువాడ, నగరపాలెం, పందలపాక, ఇచ్ఛాపురం, చిన్నయ్యపాలెం, రామునేనిపేట, రేగానిగూడెం, ముకుందపురం, వెంకటాపురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

సింహాచలం : సింహాచలం తొలిపావంచా, ధారపాలెం, పుష్కరిణి వద్ద ఉన్న 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 కార్యనిర్వాహక ఇంజినీరు బి. సింహాచలంనాయుడు తెలి పారు. కుమ్మరివీధి, పాత అడివివరం కూడలి, ధారపాలెం, సింహాచలం, సింహగిరి, పాత గోశాల కూడలి, ప్రియా గార్డెన్స్, విజినిగిరిపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎండాడ : ఎండాడ సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగు తుందని జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. వీవీనగర్, శిరుగుడినగర్, ఎండాడ పెట్రోల్ బంకు వెనుక ప్రాంతం, లలితానగర్, సందీపనినగర్, ఎండాడ బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్, ముబారక్‌కాలనీ, శాంతినగర్, గణేశ్ నగర్, వరహగిరినగర్, ఎంకే గోల్డ్, స్కైలైన్, ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డు ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు ఇస్తున్న ఆనందపురం హైస్కూల్ హెచ్‌ఎం కామేశ్వరరావు



బాలికలను అభినందిస్తున్న గొల్లలపాలెం కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగాకుమారి

ఆనందపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భీమిలి డివిజన్ స్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిసాయి. అండర్ 14, 17 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో మొదటి రోజు 750 మంది, రెండవ రోజు 750, మూడవ రోజు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్,టెన్నీకాయిట్, రన్నింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్‌ఎం కామేశ్వరరావు బహుమతులు అందజేశారు. డివిజినల్ స్థాయిలో విజేతలకు శుక్రవారం జిల్లాస్థాయి పోటీలు జరగాల్సి ఉండగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

చిట్టివలస బాలికల ప్రతిభ

తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో మూడు రోజులుగా డివిజనల్ స్థాయిలో పోటీలు జరిగాయి.అండర్ 14 విభాగం కబడ్డీలో ఆర్.హారిక, బి. హస్మిత, అండర్ 17 విభాగం చదరంగంలో పి. జ్యోత్స్న జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ తెలిపారు. అలాగే బాలుర విభాగంలో బి. గణేశ్, బోర గణ చదరంగం పోటీలకు ఎన్నికయ్యారని చెప్పారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలను ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ చిట్టిబాబు అభినందించారు.

భీమునిపట్నం : భీమిలి కేజీబీవీ బాలికలు పలు పోటీల్లో విజేతలుగా నిలిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆనందపురం హైస్కూల్లో డివిజనల్ స్థాయి పోటీలు జరిగాయి. అథ్లెటిక్స్ డిస్కస్‌త్రోలో తొమ్మిదో తరగతి విద్యార్థిని కె. కావ్య ప్రియ ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో ఏడవ తరగతి విద్యార్థిని పి. కల్యాణి కీర్తి తృతీయ స్థానం, 1500 మీటర్ల పరుగు పందెంలో 8వ తరగతి విద్యార్థిని ఇతిరుపతి ద్వితీయ స్థానం సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. విజేతలను, పీఈటీ వరలక్ష్మిని గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె అభినందించారు.



జాతీయ రహదారిపై వర్షం నీరు

మధురవాడలో కుండపోత వర్షం

మధురవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. స్వతంత్రనగర్ కాలనీ, మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ పీహెచ్‌సీ, బాపూజీనగర్ ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చంద్రంపాలెం వద్ద డ్రైనేజీలు పొంగడంతో ఎత్తు వంతెన వద్ద మోకాలు లోతులో నీరు నిలిచిపోయింది. దీంతో జాతీయ రహదారిపై కారు షెడ్ వద్ద కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. పోర్టు కాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం, వాంబే కాలనీల్లోని రహదారులపై కూడా వర్షం నీరు భారీగా ప్రవహించింది. వుడాకాలనీ, స్వతంత్రనగర్‌కాలనీ, పాత మధురవాడ మెట్ట ప్రాంతాల్లో పిడుగులు పడడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

... 5వ పేజీ తరువాయి

సెంద్వా తాలుకా కెర్మలా గ్రామానికి చెందిన శ్రీరామ్ అలియాస్ గుప్తా (60)ను దొంగనోట్ల తయారీ కేసులో ఉజ్జయిని ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి ద్వారా విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీ సెక్టార్ 11లో నివాసం ఉంటున్న పాల వరప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. వీరంతా అనంతపురంలో కలిసినప్పుడు దొంగనోట్ల తయారీ గురించి ప్రస్తావన వచ్చింది. విశాఖలోని తన ఇంట్లో దొంగనోట్లు తయారుచేసుకోవచ్చునని వరప్రసాద్ సమ్మతి తెలిపాడు. దీంతో కొన్నాళ్ల కిందట శ్రీరామ్ దొంగనోట్ల తయారీకి అవసరమైన ప్రింటర్, తెల్లపేపర్లు, కటింగ్ యంత్రాలు, గమ్, రంగులు వంటి వాటిని ముంబై తెప్పించి వరప్రసాద్ ఇంట్లో పెట్టాడు. మొదటి దశలో రూ.పది లక్షలు విలువైన రూ.500, రూ.200 నకిలీ నోట్లను తయారు చేసి, నగరానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి ద్వారా చలామణి చేసేందుకు విఫల యత్నం చేశారు. మళ్లీ రూ.500, రూ.200 నకిలీనోట్ల తయారీని ఇటీవల ప్రారంభించాడు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో ఎంవీపీ పోలీసులతో కలిసి బుధవారం రాత్రి వరప్రసాద్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో దొంగనోట్లు తయారుచేస్తూ శ్రీరామ్ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి ల్యాప్‌ట్యాప్, ప్రింటర్‌తోపాటు ఒకే పేపర్‌పై నాలుగు చొప్పున రూ.500, రూ.200 నకిలీనోట్లు ప్రింట్ చేసిన కాగితాలతోపాటు పేపర్ కటింగ్ గ్లాస్ టేబుల్, తెల్ల పేపర్‌కట్టలు రెండు, నకిలీనోట్ల సాఫ్ట్ కాపీలు కలిగిన పెన్ డ్రైవ్, గమ్ బాటిల్, గ్రీన్ థ్రెడ్ వంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శ్రీరామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మిగిలినవారి కోసం గాలిస్తున్నారు. ఈ సమావేశంలో ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఎంవీపీ సీఐ కేఎన్‌ఎస్‌వీ ప్రసాద్, టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ ప్లాట్లు

... 5వ పేజీ తరువాయి

లేఅవుట్లకు దూరంగా ప్లాట్లు ఇస్తామని ఒప్పించారు. ఆ తరువాత వ్యాపారుల ఒత్తిళ్లతో పక్కన పెట్టేశారు. వీఎంఆర్‌డీఏ (గతంలో వుడా) దాకమర్రిలో జాయింట్ వెంచర్ కింద వెన్సార్ మిడోస్‌తో కలిసి 2013లో 98.84 ఎకరాల్లో లేఅవుట్ వేసింది. అందులో హెచ్‌ఐజీ 183 ప్లాట్లు, ఎంఐజీ 348 ప్లాట్లు, ఎల్‌ఐజీ 250 ప్లాట్లతో పాటు అప్పటి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈడబ్ల్యూఎస్ కోసం 304 ప్లాట్లు కేటాయించింది. ఇతర వసతులకు మరో 14 ప్లాట్లు ఉంచారు. మొత్తం 1,163 ప్లాట్లు కాగా అందులో వీఎంఆర్‌డీఏ వాటాగా 941 ప్లాట్లు, డెవలపర్ వెన్సార్ మిడోస్‌కు 322 ప్లాట్లు ఇచ్చారు. దశల వారీగా వేలం నిర్వహించి అమ్ముకున్నారు. అప్పట్లో మార్కెట్ ధర కంటే వీఎంఆర్‌డీఏ ఎక్కువ ధర పెట్టడంతో కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో ఆరు నెలల క్రితం రేటు తగ్గించి కొన్ని ప్లాట్లు విక్రయించారు. గజం ధర రూ.21 వేల నుంచి రూ.15,500కు తగ్గించారు. అయితే ఈడబ్ల్యూఎస్ కోసం కేటాయించిన 304 ప్లాట్లు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. వాటికి అర్హులను ఎలా ఎంపిక చేయాలనే అంశంపై క్లారిటీ లేదంటున్నారు. ప్రజాప్రతినిధులు, వీఎంఆర్‌డీఏ చైర్మన్లుగా పని చేసిన వారు దీనిపై దృష్టి పెట్టలేదు.

కలెక్టర్ లేఖతో కదలిక

ఇదిలావుండగా యుద్ధంలో భర్తను కోల్పోయిన వారికి, దివ్యాంగులుగా మారిన సైనికులకు ఆనందపురం మండలం తంగుడుబిల్లి లేఅవుట్‌లో 20 ప్లాట్లు కేటాయించాలని వీఎఆర్‌డీఏకు ఇటీవల కలెక్టర్ హరేంధిరప్రసాద్ లేఖ రాసినట్టు సమాచారం. ఒక్కొక్కరికి 300 గజాల చొప్పున ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిసింది. అయితే అందులో ఇవ్వడానికి వీలు కాదని, దాకమర్రి లేఅవుట్‌లో ఈడబ్ల్యుఎస్ కోసం కేటాయించినవి ఉన్నాయని అప్పటి కమిషనర్ విశ్వనాథన్ ప్రతిపాదించారు. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచిన మీదట ఖాళీగా ఉన్న ప్లాట్లు కలెక్టర్‌కే అప్పగిస్తామని, వాటిని నిబంధనల ప్రకారం అర్హులకు కేటాయిస్తారని బోర్డుకు ప్రతిపాదించినట్టు తెలిసింది. వాటి విస్తీర్ణం సుమారు 5,500 గజాలు. ఇప్పుడు కమిషనర్ బదిలీ కావడంతో కలెక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్లాట్లు కేటాయించే అధికారం ఆయనకే ఉంది. తక్కువ ధరకు స్థలం అంటే తప్పుడు పత్రాలతో సిద్ధమయ్యేవారు ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో ప్లాట్ల కేటాయింపుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అనర్హులకు కేటాయిస్తే వీఎంఆర్‌డీఏ పరువు బజారున పడే ప్రమాదం ఉంది.

చేజేతులా...!

... 5వ పేజీ తరువాయి

స్పందించలేదు. దీంతో సదరు సంస్థకు చెందిన కీలక అధికారులు గత ఇన్‌చార్జి వీసీ, ప్రస్తుత వీసీలతోనూ పలుమార్లు సమావేశమయ్యారు. ప్రవేశ ప్రక్రియపై చర్చలు కూడా జరిపారు. ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహించాలని సంస్థ ప్రతిపాదించినా, ఏయూ నుంచి స్పందన కనిపించలేదు. దీంతో ఏయూతో చేసుకున్న ఒప్పందాన్ని ఆ సంస్థ రద్దు చేసుకుంది.

ప్రత్యామ్నాయం దిశగా..

ఏయూతో ఎంవోయూను రద్దు చేసుకున్న అవెంటల్ సంస్థ ఏటా 60 సీట్లతో ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సును నిర్వహించేలా నగర పరిధిలోని గీతం వర్సిటీతో ఒప్పందం చేసుకుంది. మరో 25 సీట్లతో కోర్సు నిర్వహించేలా జేఎన్‌టీయూకేతోనూ ఎంవోయూ చేసుకున్నట్టు సమాచారం.

పేద విద్యార్థులకు అన్యాయం

వర్సిటీలో కోర్సు నిర్వహిస్తే ఏటా సుమారు 30 నుంచి 50 మంది విద్యార్థులకు భారీ వేతనాలతో విశాఖలోనే ఉద్యోగాలు లభించేవి. కానీ అధికారులు స్పందించకపోవడంతో ఇతర విద్యాసంస్థలతో అవెంటల్ ఒప్పందం చేసుకుంది. కీలక ఒప్పందంపై వర్సిటీ అధికారుల నిర్లక్ష్యానికి కారణాలేమిటనే దానిపై ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది. దీనిపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంబాబును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించాల్సి ఉందన్నారు.

పెట్టుబడుల సదస్సుకు భారీ ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

నుంచి అంతర్జాతీయంగా పేరున్న కంపెనీల అధిపతులు, సీఈవోలు, ఎండీలు, ఇతర ప్రతినిధులు వస్తారని అంచనా వేస్తున్నారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో ప్రధాన వేదిక వద్ద సదస్సు జరగనున్నది. అయితే వచ్చే నెల 13వ తేదీనే సదస్సును నోవాటెల్ హోటల్‌లో సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఆరోజు రాత్రి అతిథులకు విందు ఏర్పాటుచేశారు. చాలావరకు అతిథులు, ప్రతినిధులు 13వ తేదీనే నగరానికి వచ్చే అవకాశం ఉంది. అతిథుల కోసం 26 హోటళ్లలో 1,200 గదులు బుక్ చేశారు. అంతర్జాతీయంగా పేరున్న కంపెనీల సీఈవోలు/చైర్మన్ల కోసం బెంజ్ కార్లు ఏర్పాటుచేస్తున్నారు. నగరంలో ఉన్న బెంజ్ కార్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి మరికొన్ని సమకూర్చుకుంటున్నారు. కాగా సదస్సు ఏర్పాట్లపై సమీక్షించేందుకు ఈనెలాఖరులో లేదా వచ్చే నెల తొలివారంలో నగరానికి రానున్నారు. ఇంకా ఉన్నతాధికారులు విశాఖలోనే మకాం వేయనున్నారు. సదస్సు నేపథ్యంలో నగరంలో ప్రధాన కూడళ్లు, పర్యాటక ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

సాలూరి, కోటి సినీ గీతాల సంగీత విభావరి రేపు

వేదిక : పౌర గ్రంథాలయం

వెంకోజీపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు 26వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 25న సాయంత్రం ద్వారకానగర్ విశాఖ పౌర గ్రంధాలయంలో ఎస్.రాజేశ్వరావు, కోటి స్వర పరచిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్న ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖ్యాతి గాంచిన గాయనీ, గాయకులు వీరిద్దరి కాంబినేషన్‌లోని సినిమా పాటలు ఆలపిస్తారని వెల్లడించారు. నగరంలోని ప్రముఖులు అతిథులుగా సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొంటున్నట్టు ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సినీ సంగీత ప్రియులు, సాలూరి రాజేశ్వరరావు, కోటి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తిరుమలరావు కోరారు.

కాలువ నిర్మిస్తామని.. రోడ్డు తవ్వేశారు

- రెండు నెలలుగా పిఠాపురం కాలనీవాసుల అవస్థలు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఇంజనీరింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి



కళాభారతి ఎదురుగా తవ్వేసిన రోడ్డు

మద్దిలపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అభివృద్ధి పనులు ప్రజలకు మేలు చేసేలా ఉండాలి. కానీ, 22వ వార్డులో అభివృద్ధి పనులు ప్రజలకు కీడు చేసేలా తయారయ్యాయి. ఒక పద్ధతి, విధానం లేకుండా చేపడుతున్న పనుల వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఎదురుగా కాలువ కోసం రెండు నెలల కిందట రోడ్డు తవ్వారు. రోడ్డుమొత్తం తవ్వితే రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయి, సగం రోడ్డు తవ్వి నిర్మాణం చేశాక, మిగతా సగం కాలువ పూర్తి చేయాలని నివాసులు సచివాలయ కార్యదర్శిని కోరారు. తమ పనికే అడ్డు చెబుతాన్నారనుకున్నారేమో కాని సిబ్బంది వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా రోడ్డు తవ్వి వదిలేశారు. ఇది జరిగి రెండు నెలలు కావస్తోంది. ఇప్పటికీ కాలువ నిర్మాణం మాత్రం చేపట్టలేదు. ఇక్కడ మాత్రమే నిర్మాణం చేయకుండా వార్డు మొత్తం కాలువల నిర్మాణం చేస్తున్నారు. కాగా కళాభారతి ఎదురుగా గొయ్యి తవ్వి వదిలేయడంతో రోజుకు ఇద్దరు ముగ్గురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, పాదచారులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. కార్లు అయితే గోతిలో దిగి బయటకు రావడానికి నానాఅవస్థలు పడుతున్నారు. గత మంగళవారం ఉదయం కూడా కారు గోతిలో దిగిపోయింది. బయటకు తీయడానికి స్థానికులు తలో చేయి వేయాల్సి వచ్చింది. దీనివల్ల కారు కింది భాగం డ్యామేజ్ అయింది.

ఇప్పటి వరకు దాదాపు వందకు పైగా ప్రమాదాలు జరిగినా గొయ్యి పూడ్చడం లేదు, కాలువ నిర్మాణం చేపట్టడం లేదు. 'ఎవరెలా పోతే మాకేంటి?' అన్న నిర్లక్ష్య ధోరణిని జీవీఎంసీ ఇంజిరింగ్ విభాగం అధికారులు అవలంభిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పిఠాపురంకాలనీ బజారు వద్ద రోడ్డు తవ్వి వంద రోజులు వదిలేశారు. పలుమార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తే కాని నిర్మాణం చేయలేదు. ఇప్పుడూ అదే పద్ధతిని కళాభారతి ఎదురుగా పాటిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ఇదే రోడ్డులో 146 సచివాలయం ఉంది. సచివాలయానికి వెళ్లే ప్రజలు సైతం గొయ్యిను చూసి ఇంజనీరింగ్ విభాగం పనితీరును ఆక్షేపిస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాజ ప్రగతికి పత్రికలు దోహదపడాలి

- ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు




ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రాంబాబు, వేదికపై ప్రొఫెసర్ ప్రేమానందం, సంతోష్ పట్నాయక్

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమాజ ప్రగతికి పత్రికలు దోహదపడాలని ఏయూ రిజిస్ట్రార్ కె.రాంబాబు పేర్కొన్నారు.ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సదస్సుల్లో భాగంగా గురువారం 'ఎవల్యూషన్ ఆఫ్ జర్నలిజం 1950 టు 2020 ద ఎరా ఆఫ్ డాక్టర్ హరేకృష్ణ మహతాబ్ టూ మోడరన్ ఇండియా'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రిజిస్ట్రార్ రాంబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట సమయంలో పత్రికలు కీలక భూమిక పోషించాయన్నారు. ప్రజలను నిరంతరం చైతన్యవంతం చేయడం, స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంచడంలో ఇవి ఎంతో కీలకంగా నిలిచాయన్నారు. పత్రిక రంగానికి విశేష సేవలు అందించిన హరేకృష్ణ మహతాబ్ కృషిని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ భారతదేశ జర్నలిజం రంగంలో వచ్చిన మార్పులను వివరించారు. సమాచారం అందించడం ప్రధాన అంశంగా జర్నలిజం ఆరంభమైందని, ప్రస్తుతం దాని స్థానంలో ఎంటర్‌టైన్‌మెంట్ చేరిందన్నారు. వాస్తవాలు, నిజానికి మధ్య వ్యత్యాసం ఉంటుందన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయుక్తంగా విభాగంలో తరచూ ఇటువంటి సమావేశాలు నిర్వహించడం, విభిన్న రంగాలకు చెందిన నిపుణులు ఆహ్వానించడం మంచి పరిణామ మన్నారు. కార్యక్రమంలో హిందూ దినపత్రిక పూర్వ పాత్రికేయులు సంతోష్ పట్నాయక్, పొలిటికల్ సైన్స్ జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం తదితరులు ప్రసంగించారు.

తమ పాపాలను ఎదుటి వారిపై నెట్టడంలో జగన్ అండ్ కో పీహెచ్‌డీ

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎద్దేవా



ఎంవీపీ కాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తాము చేసిన అవినీతి, అక్రమాలు, పాపాలను ఎదుటివారిపైకి నెట్టేయడంలో జగన్ అండ్ కో పీహెచ్‌డీ చేశారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో లిక్కర్ మాఫియా నడిపి రూ.3,500 కోట్లు దోచుకున్న విషయాన్ని ప్రజల దృష్టి నుంచి మళ్లించేందుకు జగన్ కుట్రలకు ప్లాన్ చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగానే చిత్తూరు జిల్లా ములకల చెరువు, ఇబ్రహీపట్నం నకిలీ మద్యం అంశం తెరపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయలనే ఉద్దేశంతో కల్తీ మద్యం ఫార్ములాను తాడేపల్లి ప్యాలెస్‌లోనే తయారు చేశారని, ఇందులో భాగంగానే సెప్టెంబరు 24న ఆఫ్రికాకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్న జనార్ధనరావును 23న జోగి రమేష్ తన ఇంటికి పిలిపించుకున్నారని తెలిపారు. వీళ్లిద్దరూ చిన్ననాటి నుంచే మంచి స్నేహితులు కావడంతో నకిలీ మద్యానికి పక్కా ప్రణాళికలు రచించారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులకు జోగి రమేష్ అనుచరుడు సరేష్ ములకల చెరువు కల్తీ మద్యం తయారీ ఆచూకీని అందించి, కూటమి ప్రభుత్వానికి అపాదించేందుకు ప్రయత్నించినట్టు వెల్లడైందన్నారు. గత ప్రభుత్వంలో మద్యం తయారీ కంపెనీలను జగన్ గుప్పెట్లో పెట్టుకుని, జే బ్రాండు మాత్రమే తయారు చేశారని, దీనివల్ల రాష్ట్రంలో 30 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 30 లక్షల మంది అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. జే బ్రాండులో విషపూరిత పదార్థాలు ఉన్నట్టు చెన్నై, బెంగళూరు, అమెరికా ల్యాబ్‌లు స్పష్టం చేశాయని పేర్కొన్నారు.

పెదజాలారిపేటలో చెత్తకుప్పలు తొలగింపు





వీధుల్లో చెత్తకుప్పలు తొలగించిన అనంతరం పరిశుభ్రంగా కనిపిస్తున్న పరిసరాలు

పెదవాల్తేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట చేపల మార్కెట్ వద్ద పలు వీధుల్లోని డ్రైనేజీలు, రోడ్లపై ఉన్న చెత్తకుప్పలను జీవీఎంసీ 'ఇంత నిర్లక్ష్యమా..!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'తో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకున్నారు. కాలువపై ఉంచిన పనికి రాని వస్తువులు, సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

అలాగే రోడ్ల పక్కన వ్యర్థాలను తొలగించి పరసరాలను శుభ్రపరిచారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి కల్పన లక్ష్యంగా జాబ్‌మేళాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధికారులు, కృష్ణా కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే జాబ్ మేళాల ముఖ్య ఉద్దేశమని భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ వరప్రసాద్ పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించిందన్నారు. ఐదు సంవత్సరాల్లో కోటి మంది యువతను టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. ఈ ఇంటర్న్‌షిప్ నైపుణ్యాలు పొందేందుకు దోహదపడుతూ ఉద్యోగ సామర్థ్యాన్ని పెంపొందించడంలో సహాయ పడుతుందన్నారు.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి చాముండేశ్వరరావు మాట్లాడుతూ మెగా జాబ్ మేళాల్లో 12 కంపెనీలు పాల్గొనగా, ఉద్యోగాల కోసం 899 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 257 మందికి ఉద్యోగాలకు ఎంపిక చేశారని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అందించేందుకు జిల్లాలోని పలు కంపెనీలతో చర్చించి జాబ్‌మేళాలు చేపడుతున్నామన్నారు.

కార్యక్రమంలో భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకర్, ప్లేస్‌మెంట్ అధికారి రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 36, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 64, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 24, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, క్రర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామ కాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

27 ఏళ్ల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు..



సత్యసాయిబాబు ఇద్దరు అక్కలకు అప్పగిస్తున్న రెడ్‌క్రాస్ హోంలెస్ షెల్టర్ పెదవాల్తేరు మేనేజర్ మురళీ

పెదవాల్తేర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి 27 ఏళ్ల కిందట బయటకు వెళ్లిపోయిన ఓ వ్యక్తి, కొందరు వ్యక్తుల దాడితో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందిన ఓ వ్యక్తి రెడ్‌క్రాస్ సంస్థ వద్దకు చేరాడు. ఆ వ్యక్తి గురించి ఆరా తీసిన రెడ్‌క్రాస్ సిబ్బంది గురువారం ఓ వ్యక్తిని అతడి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి.

కాకినాడకు చెందిన వక్కలంక సత్య వీరవెంకట సత్యనారాయణ సత్యసాయిబాబు (53) సామాజిక అటవీ విభాగంలో అక్కడే ఉద్యోగం చేసేవాడు. అనివార్య కారణాల వల్ల కొన్నేళ్ల కిందట ఉద్యోగం మానేసి నర్సీపట్నం చేరుకొని అక్కడ కొన్ని రోజులు ఉన్నాడు. అనంతరం దారకొండ గ్రామానికి చేరి ఎలక్ట్రికల్ పనులు చేస్తూ కొన్నాళ్లు ఉన్నాడు. ఆ పని కూడా మానేసి సరుగుడు కర్రల వ్యాపారం చేయడం మొదలు పెట్టాడు. వ్యాపారం సాగకపోవడంతో తిరిగి నర్సీపట్నం చేరుకొని కర్రల వ్యాపారం చేశాడు. అయితే అక్కడ వ్యాపారుల మధ్య విభేదాలు తలెత్తగా, కొందరు అతడిని కొట్టి ఓ చోట పడేశారు. 108 సిబ్బంది ద్వారా కేజీహెచ్‌లో చేరి చికిత్స పొందాడు. కేజీహెచ్‌లో వైద్యం పొందుతూ కోలుకోవడంతో అత డిని కేజీహెచ్ సేవా వార్డు సిబ్బంది పెదవాల్తేరులోని రెడ్ క్రాస్ సిబ్బందికి సమాచారం అందించారు. రెడ్ క్రాస్ సిబ్బంది కేజీహెచ్‌కు చేరుకొని ఈ ఏడాది జనవరి 1న రెడ్ క్రాస్ హోంకు తీసుకెళ్లారు. అక్కడ కుటుంబ వివరాలు ఆరాతీసి, ఆయన ఇద్దరు అక్క లకు పిలిపించి ఇండియన్ రెడ్‌క్రాస్ హోంలెస్ షెల్టర్ పెదవాల్తేరు మేనేజర్ మురళీ సమక్షంలో క్షేమంగా గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆరిలోవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణలో భాగంగా చెట్ల కొమ్మలు నరికివేత, లైన్ల మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఎలక్ట్రికల్ జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు (ఆపరేషన్స్) ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్ నగర్, సుందరనగర్ తదితర ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాల అందజేత

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలోని చినవాల్తేరుకు చెందిన ఇద్దరు అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన మొత్తానికి సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయంలో గురువారం అందజేశారు. చినవాల్తేర్ కొయ్యవీధికి చెందిన అడపాక అరుణ్‌కుమార్‌కు రూ.2,32,664లు, ఓల్డ్ సీబీఐ డౌన్ ప్రాంతానికి చెందిన రెగడి అప్పారావు రూ.2,33,881లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో వెలగపూడి ప్రతాప్‌రుద్ర, పీతల అమరేంద్ర, పీతల అవనీష్, నక్క వినయ్, బొట్టా రమణ తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో చెట్లు నరికివేత

- పట్టించుకోని అధికారులు



కేర్ ఆస్పత్రి సమీపంలో నరికివేసిన చెట్టు

ఆరిలోవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న పలు చెట్లను విచక్షణారహితంగా కొంతమంది నరికి వేశారు. కేర్ ఆస్పత్రి నుంచి అపోలో ఆస్పత్రికి వెళ్లే దారిలో గల చెట్టు నరికివేతకు గురయ్యాయి. ఈ చెట్లు పెద్దవిగా పెరిగి చక్కగా నీడ ఇచ్చేవి. పగటి వేళల్లో ఇక్కడ నీడ ఉండడంతో వాతావరణం ఆహ్లాదంగా ఉండేది. ఇప్పుడు చెట్లు తొలగించడంతో ఈ ప్రాంతమంతా బోసిపోయినట్టయింది. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రాజీవ్ నగర్ రహదారి



అంచుల్లో మట్టి వేయకపోవడంతో ఎత్తుగా తయారైన రహదారి

ఆరిలోవ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల పాత డెయిరీ ఫారానికి సమీపంలో గల రాజీవ్ నగర్ వెళ్లే ప్రాంతంలో ఇటీవల రోడ్డు వేశారు. ఈ రోడ్డును ఎత్తు పెంచారు. అయితే రోడ్డు అంచుల వద్ద మట్టిని వేయక పోవడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. అక్కడ రోడ్డు సమతలంగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అనాలోచిత పనులను చేపట్టి ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడం అధికారులకు తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు వేసిన ప్రాంతంలో రోడ్డు చివరల్లో మట్టి వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జగన్ అబద్ధాలను జనం నమ్మరు

- వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అబద్ధపు ప్రచారాలను ప్రజానీకం నమ్మరని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీను జనం తిరస్కరించి పదకొండు సీట్లకే పరిమితం చేసినా జగన్‌లో ఇంకామార్పు రాకపోవడం విచారకరమన్నారు. విశాఖకు వస్తొన్న గూగుల్ డేటా సెంటర్ విషయంలో జగన్ అండ్ కో చేస్తోన్నదంతా దుష్ప్రచారమేనన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందని, అందుకనే పెట్టుబడులు రాలేదన్నారు. చంద్రబాబు విజన్‌పై నమ్మకంతో మళ్లీ పెట్టుబడుదారులు ఏపీ వైపు చూస్తున్నారని, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు విశాఖ నగరానికి రావడమే అందుకు నిదర్శనమన్నారు. 2018లోనే గూగుల్ ప్రతినిధులతో నాటి చంద్రబాబు ప్రభుత్వం చర్చలు పూర్తి చేసిందని, నాడే ప్రాజెక్టు బేస్, ఎంవోయూ పూర్తయిందని గుర్తు చేశారు. విశాఖను గ్లోబల్ డేటా హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. జగన్ మాటలను ప్రజలు విశ్వసించరన్నారు.

డేటా సెంటర్ క్రెడిట్ దోపిడీకి మాజీ సీఎం ప్రయత్నం

- ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్



జగన్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తున్న నిరుద్యోగుల జేఏసీ ప్రతినిధులు

వెంకోజీపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పరిపాలనలో ఐటీ మంత్రి రాష్ట్ర నిరుద్యోగులకు తెచ్చిన పరిశ్రమలు అల్లం వెల్లులి పేస్టు, మామిడి తాండ్ర, అప్పడాలు, పచ్చళ్లు, బొబ్బట్ల కంపెనీలు మాత్రమేనని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ విమర్శించారు. ఏయూలో గురువారం ఆయన ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు జగన్ తీరును ఆక్షేపిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ తీసుకొచ్చిన పరిశ్రమలు ఏమిటో చెప్పాలని, ముందు ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే బాగుంటుందన్నారు. విశాఖలో నక్కపల్లి బల్క్ డ్రగ్ ప్లాంట్‌ని ఆపుతానని, గూగుల్ అదాని వల్లే వచ్చిందని, ఉద్యోగస్తులకు పది డీఏలకు బదులు 11 డీఏలు ఇచ్చానని చెబుతున్న వైఎస్ జగన్ మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. డేటా సెంటర్ క్రెడిట్ దోపిడీకి మాజీ ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు ఏమీ చేయకపోగా, అన్నింటిని తానే ఇచ్చానని చెప్పుకోవడం సిగ్గుచేటు అని అని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క ప్రెస్‌మీట్ కూడా వైఎస్ జగన్ పెట్టలేదని గుర్తు చేసుకోవాలన్నారు. సొంతంగా అనుభవించడానికి రుషికొండ ప్యాలెస్ కోసం కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసిన జగన్ మెడికల్ కళాశాలలు పూర్తి చేసి ఉంటే విద్యార్థులకు మెడికల్ సీట్లు వచ్చి ఉండేవి కదా అన్నారు. జగన్ హయాంలో నిరుద్యోగులు నష్టపోయిన ఐదేళ్ల కాలం, కోల్పోయిన ఉద్యోగ వయోపరిమితిని ఆయన తిరిగి ఇవ్వగలరా? వెనక్కి వెళ్లిపోయిన పరిశ్రమలను మళ్లీ తీసుకురాగలరా? అని ప్రశ్నించారు.

తోటగరువు హైస్కూలుకు ఎల్ అండ్ టీ బెంచీల వితరణ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎల్ అండ్ టీ మేనేజర్ సుబ్బారావు

ఆరిలోవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉన్నతులుగా ఎదిగేందుకు చదువు ఒక్కటే సాధనమని ఎల్ అండ్ టీ మేనేజర్ కేవీ సుబ్బారావు పేర్కొన్నారు. ఆ కంపెనీ తరఫున సీఎస్ఆర్ నిధుల నుంచి గురువారం తోటగరువు ఉన్నత పాఠశాలకు 160 డ్యూయల్ బెంచీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతిలో శ్రద్ధగా కూర్చొని పాఠ్యాంశాలు వినేందుకు అనువుగా బెంచీలు రూపొందించి అందించామన్నారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించి చక్కగా చదవాలన్నారు. చదువు వల్ల మాత్రమే మన లక్ష్యాలు చేరుకోగలమని, సమాజంలో గౌరవ స్థానం పొందే అవకాశం ఉంటుందన్నారు. పేదరికాన్ని పారదోలి మనల్ని ఆర్థికమంతులుగా చేసేది చదువు మాత్రమే అన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కేంద్ర కారాగార డిప్యూటి సూపరింటెండెంట్ సీహెచ్ సూర్యకుమార్, జైలర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానీ, ఉపాధ్యాయులు చంద్రాని, శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరలు పాల్గొన్నారు

16వ వార్డు టీడీపీ నూతన కార్యవర్గం



ర్యాలీగా ఎమ్మెల్యే కార్యాలయానికి తరలి వెళుతున్న టీడీపీ 16వ వార్డు నాయకులు, కార్యకర్తలు

ఫోటో: 23ఎఎస్‌ఫీ01: వెంకోజీపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ 16వ వార్డు నూతన కార్యవర్గం ఎంపికపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం వార్డులోని ఇసుకతోట ప్రాంతం నుంచి ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జీవీఎంసీ 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడుగా ముగడ వాసు, కార్యదర్శిగా కోట్ల శ్రీను, తెలుగు యువత అధ్యక్షుడిగా మధురవాడ అప్పారావు ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు వార్డు అధ్యక్షులుగా కొనసాగిన నారు గోపికి వార్డు క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించారు. తమకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు వీరంతా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్టతకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, సీనియర్ నాయకులు ఈగల సత్యం, ఐటీడీపీ ఇన్‌చార్జి పల్లా బాబు, మొల్లి శంకర్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన



అన్నసమారాధన చేస్తున్న అర్చక సంఘం ప్రతినిధులు

ఆరిలోవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాలభాను అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో గురవారం పాత డెయిరీ ఫారంలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జోష్యుల కామేశ్వరశర్మ, మావుడూరు కిశోర్‌కుమార్‌శర్మ మాట్లాడుతూ కార్తీక మాసం నెల రోజుల పాటు నగరంలోని వివిధ దేవాలయాల వద్ద ప్రతి రోజూ 50 మందికి అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంఘ సభ్యులతో పాటు దాతల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు.

బాలికల ఐటీఐకి మహర్దశ కలిగేనా..?

కంచరపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు ఉంది కంచరపాలెంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐ తీరు... ఇక్కడ ఐటీఐలో 12 ట్రేడుల నిర్వహణకు అనువైన అధునాతన వసతులు ఉన్నప్పటికీ, దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన నాలుగు ట్రేడులతో కాలక్షేపం జరుగుతోంది. ఇదే ఐటీఐ ప్రాంగణంలో జిల్లా ఉపాధి కార్యాలయం, నరవ ప్రభుత్వ ఐటీఐ కూడా ప్రస్తుతం నడుస్తున్నాయి. పెరుగుతున్న సాంకేతికత నేపథ్యంలో బాలికలు కూడా బాలురకు దీటుగా అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో కూడా ఉత్తమమైన ట్రేడులు ప్రారంభించి బాలికా విద్య, శిక్షణను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కంచరపాలెం బాలికల ఐటీఐలో డిమాండ్ ఉన్న ట్రేడులు లేకపోవడంతో పలువురు నిరుపేద విద్యార్థినులు శిక్షణ పొందలేకపోతున్నారు.

అప్ అండ్ స్కోప్ మోడల్ పథకంపైనే ఆశలు

కేంద్ర ప్రభుత్వం అప్&స్కోప్ మోడల్ పథకంలో భాగంగా దేశంలో ఉన్న పలు ఐటీఐల్లో నూతన ట్రేడులు, సిబ్బందిని ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరాంధ్రలోని కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ, బాలికల ఐటీఐ, నర్సీపట్నం, విజయనగరం ఐటీఐలను రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. వీటిలో ప్రభుత్వ పాత ఐటీఐలో పూర్తిస్థాయిలో ట్రేడులు, సిబ్బంది ఉన్నారు. కంచరపాలెం ప్రభుత్వ బాలికల ఐటీఐను కూడా చేర్చారు.

మౌలిక వసతులు ఉన్నా ఆశించిన ట్రేడులు శూన్యం

» కొత్త పథకంలో ప్రాధాన్యమివ్వాలని బాలికలు, తల్లిదండ్రుల డిమాండ్

ఇందులో భాగంగా బాలికల ఐటీఐలో నూతన డిమాండ్ ఉన్న ట్రేడులను ఏర్పాటు చేసి పేదవర్గాల బాలికల శిక్షణకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా పారిశ్రామిక శిక్షణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, సాంకేతిక విద్యపై అవగాహన ఉన్నవారు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దృష్టిసారించి బాలికల ఐటీఐ అభివృద్ధికి చొరవచూపితే మంచి రోజులు వచ్చి వేలాది మంది బాలికలకు నాణ్యమైన శిక్షణ అందుతుంది. బాలురతో పాటు పోటీపడుతున్న బాలికలు కూడా తమకు ఇష్టమైన రంగంలో ఉపాధి పొందేందుకు పుష్కలమైన మార్గాలు ఉంటాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కంచరపాలెంలోని బాలికల ఐటీఐ

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రేడులు..

నగరం నడిబొడ్డున ఉన్న బాలికల ఐటీఐలో ప్రస్తుతం నాలుగు ట్రేడులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కోపా (48 సీట్లు), డ్రాఫ్ట్‌మెన్ సివిల్ (24 సీట్లు), డ్రెస్ మేకింగ్ (40), ఎలక్ట్రానిక్ మెకానిక్ (48 సీట్లు) అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా బాలికలకు అనువైన ట్రేడులు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. బాలికల ఐటీఐలో అత్యధిక డిమాండ్ ఉన్న మరో ఎనిమిది కొత్త ట్రేడుల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి. అత్యధిక డిమాండ్ ఉన్న ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, వెల్డర్, ఈవీ టెక్నీషియన్ (4 వీలర్స్), సోలార్ పవర్ ఎనర్జీ, వేర్‌హౌస్ టెక్నీషియన్, బాలికలకు సంబంధించిన బ్యూటీషియన్ కోర్సుల ఏర్పాటుకు అవకాశం ఉంది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉండడం ప్రజా ప్రతినిధుల బాధ్యత అని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో ఉన్న బీజేపీ నియోజకవర్గం కార్యాయలంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు రూ.8.99 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు తక్షణ సహాయం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఆఫీస్ ఇన్‌చార్జి శ్యామలదీపిక, కార్పొరేటర్లు ఉషశ్రీ, ఆళ్ల లీలావతి, కంటిపాము కామేశ్వరి, హనూక్, సుజాత, అరుణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అల్లిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 32వ వార్డులో రూ.1.45 లక్షల కార్పొరేషన్ నిధులతో సౌత్‌జైల్ రోడ్డులోని బీటీ రోడ్డు నిర్మాణానికి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ కందుల నాగరాజు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచం నేడు విశాఖపట్నం వైపు చూసేలా కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు చేపట్టనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వరులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈ చెట్టుతో ఎప్పటికైనా ప్రమాదమే



రహదారివైపు ఒరిగి ఉన్న చెట్టు

అక్కయ్యపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లైన్ల రహదారికి ఆనుకుని ఉన్న నరసింహనగర్ ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్‌లో చెట్టు వంగిపోయింది. దీంతో ఆ చెట్టు ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితిల్లో స్థానికులు ఉన్నారు. ఈ చెట్టు కొంచెం కిందకి వంగిపోవడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలులు కొంచెం బలంగా వీచినా ఆచెట్టు కూలిపోయే ప్రమాదం ఉన్నదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ చెట్టును తొలగించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అమరవీరుడికి నివాళి



శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

మహారాణిపేట అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విధినిర్వాహణలో ప్రాణాలు విడిచిన రెల్లివీధికి చెందిన వడ్డాది శ్రీనివాసరావుకు వన్‌టౌన్ పోలీసులు గురువారం నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సీఐ జీడీ బాబు ఆధ్వర్యంలో శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పెరిగిన టమాటా ధర



టమాటా కొనుగోలుకు బారులు తీరిన వినియోగదారులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూరల్లో టమాటా లేనిదే రుచి ఉండదు. ఇప్పుడు ఆ టమాటా ధర ఒక్కరోజులోనే రూ.11 పెరిగిపోయింది. దీంతో వినియోగదారులు గురువారం నరసింహనగర్ రైతుబజార్‌లో టమాటా కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. రైతుబజార్‌కు రావల్సిన టమాటా లోడు కొంత ఆలస్యంగా రావడంతో కొనుగోలు దారులు మరిన్ని ఇబ్బందులు పడ్డారు. రైతుబజారులోనే టమాటా ఆలస్యంగా వస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై మార్కెటింగ్ శాఖాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

28 నుంచి బహుభాషా నాటకోత్సవాలు

మహారాణిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రసజ్ఞ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 4 రోజుల పాటు కళాభారతిలో నిర్వహించనున్న బహుభాషా నాటకోత్సవాల పోస్టర్‌ను సీపీ శంఖబ్రత బాగ్చీ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వి.త్రినాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు చేస్తున్న సందర్భంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బలక్ష్మీనగర్, తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం బజారు, పరదేశమ్మ ఆలయం, ఎన్‌జీజీవోస్ కాలనీ, శాంతిపురం, పద్మశ్రీ ఆసుపత్రి, సచివాలయం, కిన్నెరమెస్, మసీద్ ఏరియాల ప్రజలు సహకరించాలని కోరారు.

రైతుబజారు నుంచి మార్కెట్‌కు కూరగాయలు!

» ఉదయం 7 గంటలకే తరలింపు
» ప్రైవేటు వ్యాపారులదే హవా

అక్కయ్యపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్‌లోని కూరగాయలను బహిరంగ మార్కెట్‌కు తరలిస్తున్నారు. రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల సమయంలో రైతులు, డ్వాక్రా గ్రూపుల వారు తాజా కూరగాయలను బయట వ్యాపారులకు రైతుబజారు నుంచి తరలిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. తాజా కూరగాయలను బయట మార్కెట్లకు తరలిస్తే తాము ఏమి కొనుగోలు చేయాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. వివిధ పనులకు వెళ్లే వారు ఉదయాన్నే వచ్చి కూరగాయలు కొనుగోలు చేద్దామంటే తమ కన్నా ముందు బహిరంగ దుకాణాల వ్యాపారులకే కూరగాయలు విక్రయిస్తున్నారని పలువురు వినియోగదారులు వాపోయారు. తాజా కూరగాయలు విక్రయించాలని లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం రైతుబజారులను ఏర్పాటు చేసిందని అన్నారు. కానీ పేరుకే రైతుబజారులు, హవా మాత్రం బయట వ్యాపారులదే అని పలువురు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం అధికారులు వచ్చి ఉదయం 10 గంటల తరువాతే బహిరంగ దుకాణాలకు కూరగాయలను విక్రయించాలని వ్యాపారులకు, రైతులకు హెచ్చరించినా వారి తీరు మారలేదని పలువురు అంటున్నారు. రైతుబజారులోని కరివేపాకు నుంచి కూరగాయల మూటల వరకూ అన్ని ఆటోల్లో తరలి వెళ్లిపోతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. అధికారుల దృష్టికి వెళితే చర్యలు తీసుకుంటారేమోనని భయం లేకుండా కూరగాయలను బహిరంగంగా, ఇష్టానుసారంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి బహిరంగ దుకాణాలకు తాజా కూరగాయలను తరలించకుండా తగు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



కూరగాయలను ఆటోలో తరలిస్తున్న దృశ్యం

విద్యార్థులకు కొత్త నైపుణ్యాలను అందించాలి

» ఎంపీ శ్రీభరత్



విద్యా సంస్థల ప్రతినిధులకు జ్ఞాపికలను అందిస్తున్న ఎంపీ శ్రీభరత్

మురళీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ విద్యావిధానంతో పాటు కొత్త నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ జంక్షన్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం రాత్రి 'ఎడ్యూ ఐకాన్' అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలను వెతుక్కోవాలనే ఆలోచనలు కాకుండా, వ్యవస్థలను నిర్మించి అనేకమందికి ఉపాధి కల్పించే ఆలోచనా శక్తిని విద్యార్థులకు నేర్పించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను నేర్పించాలని పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. అనంతరం పలు విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులకు అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో బాలల నైపుణ్య ప్రదర్శనలు అలరించాయి. స్కూల్ ఆఫ్ వండర్‌కిడ్స్, మల్ల బ్యూరో ఆఫ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రైవేట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నర్సరీ నుంచి 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కేజీబీవీ పాఠశాలల కార్యదర్శి డి.దేవానందరెడ్డి, ఎమ్మెల్సీ వి.రామచంద్రారెడ్డి, ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, తదితర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

మహారాణిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లో రూ.17.50 లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు 38వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, వార్డు అధ్యక్షుడు నరసింహాచారి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత కీలకమైన బుక్కా వీధి, టెక్కలి వీధి, పప్పుల వీధి, ఉల్లిపాయల వీధి, సోల్జర్ పేట, చిన్న వీధి, వంటి ఆరు వీధులలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలకు మర్మతులు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో నర్సింగ్ అసోసియేషన్ వేడుకలు

మహారాణిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ సభ్యులుగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా కేజీహెచ్‌లోని నర్సింగ్ అసోసియేషన్ భవన్‌లో గురువారం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు టి. గంగాభవానీ మాట్లాడుతూ ప్రతి నర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ ఆస్పత్రుల నర్సులు పాల్గొన్నారు.

పెట్టుబడుల సదస్సుకు భారీ ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

నుంచి అంతర్జాతీయంగా పేరున్న కంపెనీల అధిపతులు, సీఈవోలు, ఎండీలు, ఇతర ప్రతినిధులు వస్తారని అంచనా వేస్తున్నారు.

వచ్చే నెల 14, 15 తేదీల్లో ప్రధాన వేదిక వద్ద సదస్సు జరగనున్నది. అయితే వచ్చే నెల 13వ తేదీనే సదస్సును నోవాటెల్ హోటల్‌లో సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఆరోజు రాత్రి అతిథులకు విందు ఏర్పాటుచేశారు. చాలావరకు అతిథులు, ప్రతినిధులు 13వ తేదీనే నగరానికి వచ్చే అవకాశం ఉంది. అతిథుల కోసం 26 హోటళ్లలో 1,200 గదులు బుక్ చేశారు. అంతర్జాతీయంగా పేరున్న కంపెనీల సీఈవోలు/చైర్మన్ల కోసం బెంజ్ కార్లు ఏర్పాటుచేస్తున్నారు. నగరంలో ఉన్న బెంజ్ కార్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి మరికొన్ని సమకూర్చుకుంటున్నారు. కాగా సదస్సు ఏర్పాట్లపై సమీక్షించేందుకు ఈనెలాఖరులో లేదా వచ్చే నెల తొలివారంలో నగరానికి రానున్నారు. ఇంకా ఉన్నతాధికారులు విశాఖలోనే మకాం వేయనున్నారు. సదస్సు నేపథ్యంలో నగరంలో ప్రధాన కూడళ్లు, పర్యాటక ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న అతిథులు

సీతంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు సేవా దృక్పథంతో చేయూతను ఇవ్వాలని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ పేర్కొన్నారు. విశాఖపట్నం రోటరీ క్లబ్ ఆఫ్ వాల్తేరు, విజన్ ఎయిడెడ్ ఇండియా సహకారంతో దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు లాప్‌టాప్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గ్లాసెస్, మొబైల్ ఫోన్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను చేపట్టి విద్యార్థులకు ఉచితంగా అందజేయడంలో విజన్ ఎయిడ్ ఎండియా ప్రాజెక్టు ఛైర్మన్, రోటరీ క్లబ్ ఆఫ్ వాల్తేర్ పూర్వ అధ్యక్షుడు శ్రీనివాస అవసరాల పాత్ర కీలకమన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ వాల్తేర్ అధ్యక్షుడు అడపా భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజన్ ఎయిడ్ ఇండియా ఎమిరిటెస్ ఛైర్మన్ ఎంఎస్ రాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఎల్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

మర్రిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు మర్రిపాలెం మహారాణివీధిలో జైభీమ్ జైరాం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దీపావళి రోజున ప్రారంభమైన ఉత్సవాలు నాగుల చవితి రోజును ముగుస్తాయని తెలిపారు. శుక్రవారం గౌరీపరమేశ్వరుల ఊరేగింపు, పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

తిరు నక్షత్ర పూజలు ప్రారంభం

సింహాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో విశిష్టాద్వైత మతవ్యాపకులు మనవాళ్ల మహామునుల తిరు నక్షత్ర పూజలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు షోడశోపచారాల పూజలు జరిపారు. అనంతరం అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని నాలుగు వేల పాశురాల పారాయణలను ప్రారంభించి మధ్యాహ్నం రాజభోగం సమయానికి 800 పాశురాలు పూర్తిచేశారు.

రోడ్డుపై చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ దీనిని పూర్ణామార్కెట్‌రోడ్డు నుంచి పర్యవేక్షించగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిబ్బంది డ్రోన్ వీడియోను విశ్లేషించి ఆ మార్గంలో చెత్త ఎక్కడెక్కడ ఉందనే సమాచారాన్ని సంబంధిత ప్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టర్, జోనల్ కమిషనర్లకు వెంటవెంటనే పంపించారు. దీనివల్ల రోడ్లపై చెత్త కనిపించకుండా చేయవచ్చునని భావించిన కమిషనర్ ఇకపై నిరంతరం దీనిని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై చెత్త పడేసే వారితోపాటు దుకాణాల వద్ద చెత్తను వేసేందుకు డస్ట్ బిన్‌లు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యాపారులకు జరిమానా విధించే బాధ్యతను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు అప్పగించారు. డ్రోన్ ఆపరేటర్ ప్రతిరోజూ ఏదో ఒక జోన్‌కు వెళ్లి ఆ జోన్‌లో ప్రధాన మార్గాలను వీడియో తీయాల్సి ఉంటుంది. దీని గురించి ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, రోడ్లను ఎంత శుభ్రం చేస్తున్నా ప్రజలు, వ్యాపారుల నిర్లక్ష్యం కారణంగా చెత్తమయంగా మారుతున్నాయని, దీనిని అరికట్టేందుకు కొత్త విధానం చాలావరకు సహాయపడుతుందని అన్నారు.

బీఈడీ కాలేజీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కల్పిస్తుండడం పట్ల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏయూ పరిధిలో 59 కాలేజీలు

ఏయూ పరిధిలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 59 బీఈడీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో కొన్ని కాలేజీలు అడ్డగోలుగా ఫీజులు వసూలుచేస్తున్నాయి. ఫీజుల వసూలుపై విద్యార్థులు కొందరు వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు స్పందించి ఇప్పటికే వసూలు చేసిన ఫీజులను తిరిగి చెల్లించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఈడబ్ల్యూఎస్ ప్లాట్లు

... 5వ పేజీ తరువాయి

లేఅవుట్లకు దూరంగా ప్లాట్లు ఇస్తామని ఒప్పించారు. ఆ తరువాత వ్యాపారుల ఒత్తిళ్లతో పక్కన పెట్టేశారు.

వీఎంఆర్‌డీఏ (గతంలో వుడా) దాకమర్రిలో జాయింట్ వెంచర్ కింద వెన్సార్ మిడోస్‌తో కలిసి 2013లో 98.84 ఎకరాల్లో లేఅవుట్ వేసింది. అందులో హెచ్‌ఐజీ 183 ప్లాట్లు, ఎంఐజీ 348 ప్లాట్లు, ఎల్ఐజీ 250 ప్లాట్లతో పాటు అప్పటి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈడబ్ల్యుఎస్ కోసం 304 ప్లాట్లు కేటాయించింది. ఇతర వసతులకు మరో 14 ప్లాట్లు ఉంచారు. మొత్తం 1,163 ప్లాట్లు కాగా అందులో వీఎంఆర్‌డీఏ వాటాగా 941 ప్లాట్లు, డెవలపర్ వెన్సార్ మిడోస్‌కు 322 ప్లాట్లు ఇచ్చారు. దశల వారీగా వేలం నిర్వహించి అమ్ముకున్నారు. అప్పట్లో మార్కెట్ ధర కంటే వీఎంఆర్‌డీఏ ఎక్కువ ధర పెట్టడంతో కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో ఆరు నెలల క్రితం రేటు తగ్గించి కొన్ని ప్లాట్లు విక్రయించారు. గజం ధర రూ.21 వేల నుంచి రూ.15,500కు తగ్గించారు.

అయితే ఈడబ్ల్యుఎస్ కోసం కేటాయించిన 304 ప్లాట్లు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. వాటికి అర్హులను ఎలా ఎంపిక చేయాలనే అంశంపై క్లారిటీ లేదంటున్నారు. ప్రజా ప్రతినిధులు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్లుగా పనిచేసిన వారు దీనిపై దృష్టి పెట్టలేదు.

కలెక్టర్ లేఖతో కదలిక

ఇదిలావుండగా యుద్ధంలో భర్తను కోల్పోయిన వారికి, దివ్యాంగులుగా మారిన సైనికులకు ఆనందపురం మండలం తంగుడుబిల్లి లేఅవుట్‌లో 20 ప్లాట్లు కేటాయించాలని వీఎంఆర్‌డీఏకు ఇటీవల కలెక్టర్ హరేంధిరప్రసాద్ లేఖ రాసినట్టు సమాచారం. ఒక్కొక్కరికి 300 గజాల చొప్పున ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిసింది. అయితే అందులో ఇవ్వడానికి వీలు కాదని, దాకమర్రి లేఅవుట్‌లో ఈడబ్ల్యుఎస్ కోసం కేటాయించినవి ఉన్నాయని అప్పటి కమిషనర్ విశ్వనాథన్ ప్రతిపాదించారు. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచిన మీదట ఖాళీగా ఉన్న ప్లాట్లు కలెక్టర్‌కే అప్పగిస్తామని, వాటిని నిబంధనల ప్రకారం అర్హులకు కేటాయిస్తారని బోర్డుకు ప్రతిపాదించినట్లు తెలిసింది. వాటి విస్తీర్ణం సుమారు 5,500 గజాలు. ఇప్పుడు కమిషనర్ బదిలీ కావడంతో కలెక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్లాట్లు కేటాయించే అధికారం ఆయనకే ఉంది. తక్కువ ధరకు స్థలం అంటే తప్పుడు పత్రాలతో సిద్ధమయ్యేవారు ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో ప్లాట్ల కేటాయింపుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అనర్హులకు కేటాయిస్తే వీఎంఆర్‌డీఏ పరువు బజారున పడే ప్రమాదం ఉంది.

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

... 5వ పేజీ తరువాయి

సెంద్వా తాలుకా కెర్మలా గ్రామానికి చెందిన శ్రీరామ్ అలియాస్ గుప్తా (60)ను దొంగనోట్ల తయారీ కేసులో ఉజ్జయిని ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి ద్వారా విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీ సెక్టార్ 11లో నివాసం ఉంటున్న పాల వరప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. వీరంతా అనంతపురంలో కలిసినప్పుడు దొంగనోట్ల తయారీ గురించి ప్రస్తావన వచ్చింది. విశాఖలోని తన ఇంట్లో దొంగనోట్లు తయారుచేసుకోవచ్చునని వరప్రసాద్ సమ్మతి తెలిపాడు. దీంతో కొన్నాళ్ల కిందట శ్రీరామ్ దొంగనోట్ల తయారీకి అవసరమైన ప్రింటర్, తెల్లపేపర్లు, కటింగ్ యంత్రాలు, గమ్, రంగులు వంటి వాటిని ముంబై తెప్పించి వరప్రసాద్ ఇంట్లో పెట్టాడు. మొదటి దశలో రూ.పది లక్షలు విలువైన రూ.500, రూ.200 నకిలీ నోట్లను తయారు చేసి, నగరానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి ద్వారా చలామణి చేసేందుకు విఫల యత్నం చేశారు. మళ్లీ రూ.500, రూ.200 నకిలీనోట్ల తయారీని ఇటీవల ప్రారంభించాడు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో ఎంవీపీ పోలీసులతో కలిసి బుధవారం రాత్రి వరప్రసాద్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో దొంగనోట్లు తయారుచేస్తూ శ్రీరామ్ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి ల్యాప్‌ట్యాప్, ప్రింటర్‌తోపాటు ఒకే పేపర్‌పై నాలుగు చొప్పున రూ.500, రూ.200 నకిలీనోట్లు ప్రింట్ చేసిన కాగితాలతోపాటు పేపర్ కటింగ్ గ్లాస్ టేబుల్, తెల్ల పేపర్‌కట్టలు రెండు, నకిలీనోట్ల సాఫ్ట్ కాపీలు కలిగిన పెన్ డ్రైవ్, గమ్ బాటిల్, గ్రీన్ థ్రెడ్ వంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శ్రీరామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మిగిలినవారి కోసం గాలిస్తున్నారు. ఈ సమావేశంలో ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఎంవీపీ సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్, టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

చేజేతులా...!

... 5వ పేజీ తరువాయి

స్పందించలేదు. దీంతో సదరు సంస్థకు చెందిన కీలక అధికారులు గత ఇన్‌చార్జి వీసీ, ప్రస్తుత వీసీలతోనూ పలుమార్లు సమావేశమయ్యారు. ప్రవేశ ప్రక్రియపై చర్చలు కూడా జరిపారు. ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహించాలని సంస్థ ప్రతిపాదించినా, ఏయూ నుంచి స్పందన కనిపించలేదు. దీంతో ఏయూతో చేసుకున్న ఒప్పందాన్ని ఆ సంస్థ రద్దు చేసుకుంది.

ప్రత్యామ్నాయం దిశగా..

ఏయూతో ఎంవోయూను రద్దు చేసుకున్న అవెంటల్ సంస్థ ఏటా 60 సీట్లతో ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సును నిర్వహించేలా నగర పరిధిలోని గీతం వర్సిటీతో ఒప్పందం చేసుకుంది. మరో 25 సీట్లతో కోర్సు నిర్వహించేలా జేఎన్‌టీయూకేతోనూ ఎంవోయూ చేసుకున్నట్టు సమాచారం.

పేద విద్యార్థులకు అన్యాయం

వర్సిటీలో కోర్సు నిర్వహిస్తే ఏటా సుమారు 30 నుంచి 50 మంది విద్యార్థులకు భారీ వేతనాలతో విశాఖలోనే ఉద్యోగాలు లభించేవి. కానీ అధికారులు స్పందించకపోవడంతో ఇతర విద్యాసంస్థలతో అవెంటల్ ఒప్పందం చేసుకుంది. కీలక ఒప్పందంపై వర్సిటీ అధికారుల నిర్లక్ష్యానికి కారణాలేమిటనే దానిపై ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది. దీనిపై ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంబాబును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించాల్సి ఉందన్నారు.

మరో విభాగం నిర్వహణ ప్రైవేటుకు...

... 5వ పేజీ తరువాయి

ప్లాంటులోని బంకర్లలో సింటర్ తయారీకి అవసరమైన ముడి పదార్థాలన్నీ ఉంటాయి. వాటిని సింటర్ ప్లాంటుకు తెప్పించుకొని, సక్రమంగా నిర్వహించుకోవలసిన బాధ్యత కాంట్రాక్టు సంస్థదే. పర్యవేక్షణకు మాత్రం స్టీల్ ప్లాంటు అధికారులను ఉంచుతారు. మిగిలిన ప్రక్రియ మొత్తం ప్రైవేటు సంస్థే చూసుకోవాలి.

మదీనాబాగ్ జంక్షన్‌లో ఆక్రమణల జోరు!

» రోజురోజుకు అధికమవుతున్న దుకాణాలు

» సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదని వెల్లువెత్తుతున్న ఆరోపణలు

» ఉన్నాతాధికారులు స్పందించాలని స్థానికుల వేడుకోలు



మదీనాబాగ్ కూడలిలో కాలువ పక్కన వెలసిన అక్రమ నిర్మాణాలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 77వ వార్డు పరిధి మదీనాబాగ్ జంక్షన్‌లో అక్రమ దుకాణాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. మదీనాబాగ్ కూడలిలో ఎక్కడ పడితే అక్కడ చిన్నపాటి దుకాణాలు వెలుస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి దుకాణాలతో కొద్దిరోజుల పాటు కాలం గడిపాక సదరు ఆక్రమణదారులు అక్కడ శాశ్వతంగా దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కూడలిలో గల రోడ్డు పక్కన, కాలువ పక్కన గల ప్రభుత్వ స్థలాల్లో ఇష్టారాజ్యంగా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక నాయకులు, ఓ మాజీ ఉక్కు ఉద్యోగి ఇక్కడ పెత్తనం చెలాయిస్తూ ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలను ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇటీవల జీవీఎంసీ పరిధిలో అన్నిచోట్లా అక్రమ కట్టడాలను, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన బడ్డీలను అధికారులు తొలగించి నప్పటికీ ఈ ప్రాంతం వైపు కన్నెత్తయినా చూడక పోవడం పలు అనుమానాలను తావిస్తున్నది. స్థానికంగా ఉన్న సచివాలయ, రెవెన్యూ సిబ్బంది మామూళ్ల మత్తులో అక్రమంగా వెలుస్తున్న దుకాణాలపై దృష్టిసారించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా మదీనాబాగ్ జంక్షన్‌లో అక్రమ దుకాణాలు వెలుస్తున్నాయని, వాటిని తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. స్థానికంగా అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లే ఇక్కడ రోజురోజుకు ఆక్రమణలు అధికమవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.



అయ్యప్ప స్వామి ఆలయం వద్ద అన్న సమారాధనను ప్రారంభించిన నితీశ్‌రెడ్డి

నిత్యాన్న సమారాధన ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో గత 25 ఏళ్లుగా కార్తీక మాసం ప్రారంబం నుంచి నిర్వహిస్తున్న నిత్యాన్న సమారాధన కార్యక్రమాన్ని గురువారం ప్రారంబించారు. పంచామృతాలతో అయ్యప్పస్వామికి ప్రత్యేక అబిషేకాలు చేసిన వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప భక్తులకు నిత్యాన్న సమారాధనను స్థానిక పారిశ్రామికవేత్తలు తిప్పల నితీశ్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి అదపాక వెంకటరమణ, వైసీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, బోగాది సన్యాసిరావు, ఆలయ కమిటీ సభ్యులు మురళీశ్వరరావు, నాయుడు , గొందేశి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

ఆటోనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఎల్వీ నగర్, డ్రైవర్స్ కాలనీ, తోకాడ, కుంచుమాంబ కాలనీ, ఆటోనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అలాగే గాజువాక జగ్గు జంక్షన్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ బీకే నాయుడు, ఏడీఈ అడబాల పార్థసారథి, ఏఈ జ్యోతి పేర్కొన్నారు. అందువల్ల కణితి రోడ్డు, జగ్గు జంక్షన్, గొంతువానిపాలెం, చైతన్య నగర్, నాయుడోరు వీధి, ప్రశాంతి నగర్, మెహర్ నగర్, గ్రంథాలయం వీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్, జగ్గయ్యపాలెం 11కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా షీలానగర్, గవర జగ్గయ్యపాలెం, హరిజన జగ్గయ్యపాలెం, అయ్యప్ప నగర్, కుమిలి లేఅవుట్, దుర్గా కాలనీ, గోదావరి లేఅవుట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పెందుర్తి: చినముషిడివాడ 33/11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. అందువల్ల సుజాతనగర్ 80 ఫీట్ అపార్టుమెంట్స్, ఎన్ఏడీ లేఅవుట్, శతాబ్ది నగర్, రత్నగిరినగర్ వై2కే పార్కు, సూర్యానగర్, గొల్లవిల్లిపాలెం, ఎల్ఐసీ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

'రోలుగుంట సూరి' పోస్టర్ ఆవిష్కరణ



'రోలుగుంట సూరి' సినిమా పోస్టరును ఆవిష్కరిస్తున్న పంచకర్ల, తదితరులు

పెందుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తపస్వి ఆర్ట్ క్రియేషన్స్‌పై వాస్తవ సంఘటన ఆధారంగా గ్రామీణ నేపథ్యంతో నిర్మించిన 'రోలుగుంట సూరి' చిత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చిత్ర బృందం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఈ సినిమా పోస్టరును ఆవిష్కరించి చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ఈ చిత్రం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. నాగార్జున అద్య, భావన హీరోహీరోయిన్లుగా నటించిన ఈచిత్రానికి నిర్మాత సౌమ్య, దర్శకుడు అనిల్‌కుమార్ పల్లా. కార్యక్రమంలో చిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని పరిరక్షించాలని వినతి

వేపగుంట సమీప షిప్‌యార్డు కాలనీలో గల పార్కు స్థలం ఆక్రమణకు గురవుతుందని, దీనిని పరిరక్షించాలంటూ కాలనీవాసులు ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు పార్కు స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన కంటెయినర్‌ను తొలగించాలని ఆరో జోన్ ప్లానింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

మల్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ట్రేడ్ యూనియన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (టీయూఎస్ఆర్) ఆధ్వర్యంలో గురువారం పలువురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేయడం అభినందనీయమని కోరమాండల్ యూనిట్ వైస్ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. కోరమాండల్ ఎరువుల కర్మాగారం రిక్రియేషన్ క్లబ్‌లో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, అంధ పాఠశాలలు, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు, అనాథ చిన్నారులకు సేవలందిస్తుండడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ఐవీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా కారుమూరి మహేశ్



కారుమూరి మహేశ్

కూర్మన్నపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య ఐవీఎఫ్ అదనపు ప్రధాన కార్యదర్శిగా 87వ వార్డు పరిధి కణితి కాలనీకి చెందిన కారుమూరి మహేశ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు నియమించారు.

ఈ సందర్భంగా గురువారం వడ్లపూడి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మహేశ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుంటారన్నారు. తమ సంఘం ద్వారా తాము చేసే సేవలను గురించి తనకు రాష్ట్ర పదవిని అప్పగించిన కోన శ్రీనివాసరావుకు, ప్రధాన కార్యదర్శి జి.రామ్మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి, ఆర్యవైశ్యుల సమస్యలను సంఘ పెద్దలు, ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి సేవకుడిలా శ్రమిస్తానని పేర్కొన్నారు.

సుశీల గజేంద్రరరావుకు సత్కారం

నంపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్వహిత చారిటబుల్ ట్రస్టు ద్వారా స్థానికంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ కేంబ్రిడ్జి డిజిటల్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన గుదే సుశీల గజేంద్రరరావును గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి మాట్లాడుతూ సర్వహిత చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి పేదలకు సుశీల గజేంద్రరరావు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు విందుల వెంకటరమణ, ఇల్లపు ప్రసాద్, బి.చందూరమేశ్, డి.రమేశ్, తాతారావు, బి.సత్యనారాయణ, గౌరి, బి.శ్రీను, బి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మేహాద్రిగెడ్డ నిర్వాసితుల స్థలాల రిజిస్ట్రేషన్లపై సమావేశం

ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతాం: ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్వాసితుల స్థలాల రిజిస్ట్రేషన్లపై పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని నిర్వాసితుల స్థలాల రిజిస్ట్రేషన్లను జరిపే ప్రక్రియ కోసం గ్రామస్థులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రభుత్వ భూముల్లో నివాసం ఏర్పరుచుకున్న లబ్ధిదారుల ఇళ్లకు గతంలో పట్టాలు మంజూరు చేశారు. వారికి తాజాగా రిజిస్ట్రేషన్లు చేస్తున్న నేపథ్యంలో నిర్వాసితుల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేపట్టడానికి తగిన ప్రణాళికను రూపొందించడంపై అధికారులతో చర్చించారు. కాగా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పద్మనాభ నగర్ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. దీంతో నిర్వాసితులను ఆక్రమణదారులుగా పరిగణించకుండా ప్రత్యేక రిజిస్ట్రేషన్లు చేసేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై తగిన ప్రణాళిక రూపొందించి రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు చేపడతామని గణబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహశీల్దార్ రమేశ్, జడ్పీ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రచ్చబండ

అగనంపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో గురువారం అగనంపూడి కూడలిలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమెల్యే, తైనాల విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని చూడడం సిగ్గుచేటని విమర్శించారు. వైసీపీ గాజువాక కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు జి.పూర్ణనందశర్మ, జి.శ్రీను, ఎన్.రమణబాబు, పైడిరాజు, ఎం.శ్రీను, వాసు, కె.అప్పారావు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి పూజలు

అగనంపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో స్వామివారికి షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సాయినాథున్ని శోభాయమానంగా అలంకరించి పూజలు చేయగా భక్తులు దర్శించుకున్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 36, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 64, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 24, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

గాజువాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

» పరుగులు తీస్తున్న అభివృద్ధి పనులు: మేయర్ 'పీలా'



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు, పీలా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. రూ.8 కోట్ల వ్యయంతో జగ్గు జంక్షన్ నుంచి వై-జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ, 76, 72 వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా గాజువాకను మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు జీవీఎంసీ, ఎమ్మెల్యేగా తాను కృషి చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులను విస్మరించడం వల్లే ఇప్పుడు అన్ని ప్రాంతాల ప్రగతికి అధిక నిధులు వెచ్చించాల్సి వస్తుందని పేర్కొన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జీవీఎంసీలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయన్నారు. విశాఖ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గందం శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఏజే స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, రాజాన రామారావు, బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, జీవీఎంసీ ఎస్ఈ గోవిందరావు, ఈఈ రాయల్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి కేంద్రంగానే కల్తీ మద్యం ఫార్ములా తయారీ

» పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

గోపాలపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగానే జగన్ అండ్ కో కల్తీ మద్యం ఫార్ములా తయారు చేసుకున్నారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆరోపించారు. గోపాలపట్నంలోని తమ నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం అంశంపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి, ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వినియోగదారుల భద్రత కోసం ప్రతి మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్ వ్యవస్థను ప్రవేశపెట్టి కల్తీ లేని మద్యం సరఫరాకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

జగన్ ప్రభుత్వ హయాంలో రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణం చేసి ఇప్పుడు కల్తీ మద్యం ఘటనపై దుష్ప్రచారం చేస్తుండడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఆఫ్రికా వెళ్లడానికి టికెట్లు బుక్ చేసుకున్న జనార్ధనరావు కల్తీ మద్యం ప్రణాళిక కోసమే జోగి రమేశ్ ఇంటికి వెళ్లారని ఆరోపించారు. వైసీపీ పాలనలో మద్యం కుంభకోణం ద్వారా విదేశాల్లో మనీ ల్యాండరింగ్ జరిగిందని, ఆ డబ్బుతోనే దుబాయ్, ఆఫ్రికా దేశాల్లో ఆ పార్టీ నేతలు భూములు కొనుగోలు చేశారన్నారు. రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరుతో సునీల్‌రెడ్డి, అనీల్‌రెడ్డి ఆఫ్రికాలోని కామరూన్ దేశంలో కల్తీ మద్యం వ్యాపారం చేయగా ఆ కంపెనీని 2013లో అక్కడి ప్రభుత్వం సీజ్ చేసిందని గణబాబు తెలిపారు. ఈ ఇద్దరూ జగన్‌రెడ్డి బినామీలు కాదా అని ప్రశ్నించారు. మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్టుల్లో కల్తీ మద్యం వ్యాపార లావాదేవీల్లో రూ.5 కోట్లు జమ అయినట్లు సిట్ నివేదికలో పేర్కొందన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

» సీపీ శంఖబ్రత బాగ్చి



నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళల సాధికారత, రక్షణ విభాగం ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ చాలెంజెస్ ఫర్ వుమెన్' అనే అంశంపై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆధునిక డిజిటల్ యుగంలో మహిళలు సైబర్ నేరాల బారిన ఎక్కువగా పడుతున్నారన్నారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునే ముందు ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ బ్లాక్ మెయిలింగ్, ఫేక్ ప్రొఫైల్ వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు అందరూ అవగాహన కలిగివుండడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకోవాలన్నారు. సైబర్ మోసాలపై 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం సీపీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు

నడుపూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్



మాట్లాడుతున్న రాచకొండ శ్రీనివాస్

పెదగంట్యాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించిన వారికి మంచి గుర్తింపు లభిస్తుందని నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నడుపూరు హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన డివిజనల్ స్థాయి క్రీడా పోటీలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనంతరం విజేతలను ప్రకటించారు. డివిజనల్ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన 1,100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాలుగా ఈ పోటీలను నిర్వహించారు. ఈ రెండు విభాగాల్లోనూ కబడ్డీలో 48 మంది, ఖోఖోలో 48 మంది, వాలీబాల్‌లో 48, చెస్‌లో 10, యోగాలో 10 మంది, అథ్లెటిక్స్‌లో ఒక్కో విభాగానికి ముగ్గురి చొప్పున ఎంపిక చేశారు. అన్ని క్రీడలకు సంబంధించి నడుపూరు హైస్కూల్ విద్యార్థులు 28 మంది ఎంపికైనట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఎంపికైన వారంతా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతల్లో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని రాచకొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భానోజీరావు, రవి, రామచంద్రనాయుడు, శ్రావణి, షమీ మున్నీసా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి ఖోఖో జట్టుకు, చెస్ పోటీలకు ఎంపికైన అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులను గురువారం ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం అభినందించారు. విద్యార్థులుఎ చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం'



మహిళలతో మాట్లాడుతున్న దామోదరరావు, జగన్

కూర్మన్నపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ దామోదరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో గల పలు పార్కులను గురువారం వారు సందర్శించడంతో పాటు స్థానిక మహిళలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కుల నిర్వహణ ఎలా ఉందో ఆరా తీశారు. నిర్వాసిత కాలనీలు ఏర్పడి మూడు దశాబ్దాలు గడిచినా అభివృద్ధికి నోచుకోలేదంటూ స్థానికులు తమ ఇబ్బందులను ఏకరువు పెట్టారు. పార్కుల్లో కనీస వసతుల కల్పనకు అంచనాలను రూపొందించాలని అధికారులను వారు ఆదేశించారు. స్థానిక నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, విశ్వేశ్వరరావు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

'అంబుజా'ను వ్యతిరేకిస్తూ వామపక్షాల ధర్నా



తహశీల్దార్ అమలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెదగంట్యాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపాన అదానీ యాజమాన్యం అంబుజా సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రక్రియను వ్యతిరేకిస్తూ గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో ఇక్కడి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ ఇక్కడ సిమెంటు కంపెనీ ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజలంతా కాలుష్య కోరల్లో చిక్కుకుంటారని, అనేక వ్యాధుల బారినపడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత కూటమి నాయకులు మౌనాన్ని వీడి తమ అభిప్రాయాలను ప్రజల ముందు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను పరిగణలోకి తీసుకుని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రభుత్వంతో చర్చించి సిమెంటు కంపెనీ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ అమలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎం.వెంకటేశ్వరులు, దేవ, కె.సత్యాంజనేయ, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.పోలయ్య, ఎం.రాంబాబు, సంతోశం, డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

26న జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న వెంకటేశ్వర కాలనీలోని బీవీకే స్కూల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి భగవద్గీత పోటీల వాల్ పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, చిన్మయ మిషన్ సభ్యులు ఆవిష్కరించారు. పోటీలు జరిగే బీవీకే స్కూల్‌లో ఏర్పాట్లను గురువారం చిన్మయ మిషన్ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతు ప్రతి భారతీయుడు భగవద్గీత పఠనం చేయడంతో పాటు అందులోని అంశాలను ఆచరించాలని కోరారు. చిన్మయ మిషన్ సభ్యులు ఎస్వీ స్వామి, ప్రజ్ఞ, భారతి, జి.శంకరరావు, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'లో ఈ నెల 101 మంది పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ఈ నెలలో 101 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. సాధారణంగా ప్లాంటులో జూన్, జూలై నెలల్లో పదవీ విరమణలు ఎక్కువగా ఉంటాయి. కానీ ఈ ఏడాది రికార్డు స్థాయిలో ప్రతినెలా పదవీ విరమణలు వందకు పైగానే ఉన్నాయి. ఇటీవల కాలంలో వీఆర్ఎస్‌లు, మరోపక్క భారీ సంఖ్యలో పదవీ విరమణలు ఉండటంతో ఆయా విభాగాల్లో ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉంటుందని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు.

గవర్నర్‌కు అధికారుల ఆత్మీయ వీడ్కోలు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీడ్కోలు పలుకుతున్న జేసీ మయూర్ అశోక్

గోపాలపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు గురువారం అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు నగరం నుంచి రోడ్డుమార్గంలో సాయంత్రం విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్ నజీర్‌కు జేసీ మయూర్‌అశోక్, అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం గవర్నర్ బెంగుళూరు బయలుదేరి వెళ్లారు.

నగరానికి చేరుకున్న ఇంగ్లండ్ మహిళా క్రికెటర్లు


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఇంగ్లండ్ జట్టు సభ్యులు

విశాఖపట్నం స్పోర్ట్స్/ గోపాలపట్నం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో భాగంగా ఈనెల 26న ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో న్యూజిలాండ్‌తో తలపడనున్న ఇంగ్లండ్ జట్టు క్రికెటర్లు గురువారం నగరానికి చేరుకున్నారు. ఇండోర్ నుంచి చార్టెడ్ ఫ్లైట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో రాడిసన్ బ్లూ రిసార్టుకు వెళ్లారు. జట్టు సభ్యుల్లో కెప్టెన్ బ్రంట్‌తోపాటు టామీ బ్యూమౌంట్ (వికెట్ కీపర్), అమీజోన్స్, హీథర్ నైట్, సోఫియా డంక్లీ, ఎమ్మాలాంబ్, ఆలిస్ కాప్సే, షార్లెట్ డీన్, సోఫీ ఎక్లెస్టోన్, లిన్సే స్మిత్, లారెన్ బెల్, సారా గ్లెన్, ఆర్లోట్, లారెన్ ఫైలర్, డేనియ్ వ్యాట్ హాడ్జ్ చేరుకున్నారు. ఈనెల 22న ఇండోర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఓటమి చెందిన ఇంగ్లండ్ ఇప్పటివరకు 6 మ్యాచ్‌లు ఆడి నాలుగింటిలో విజయం సాధించగా, ఒక ఓటమి, ఒక మ్యాచ్ ఫలితం తేలకపోవడంతో తొమ్మిది పాయింట్లు సాధించి సెమీఫైనల్స్ బెర్తును దాదాపుగా ఖరారు చేసుకుంది. కాగా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఇంగ్లండ్ క్రికెటర్లు సాధన చేయనున్నారు.

బెంగళూరు- ఖరగ్‌పూర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు, ఖరగ్‌పూర్ మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 06263 నంబరు గల రైలు ఈనెల 29న ఉదయం 9.50కు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.28 గంటలకు కొత్తవలస, 5.10 గంటలకు విజయనగరం, 6.08 గంటలకు శ్రీకాకుళం, గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఖరగ్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06264 నంబరు గల రైలు ఈనెల 30న (గురువారం) సాయంత్రం 5.45 గంటలకు ఖరగ్‌పూర్‌లో బయలుదేరి శుక్రవారం రాత్రి 11.30 గంటలకు బెంగళూరు చేరుతుంది.

ఎస్సీలకు వాణిజ్య దుకాణాల కేటాయింపు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో ఆరు వాణిజ్య దుకాణాలను కేటాయించేందుకు ఎస్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సంస్థ ఈడీ ఎం.సత్యపద్మ ఒక తెలిపారు. పెదగంట్యాడ ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఐదు, సిరిపురం వుడా కాంప్లెక్స్‌లో ఒక దుకాణం అద్దె ప్రాతిపదికన ఏడేళ్లకు కేటాయిస్తామని, ప్రతి రెండేళ్లకు మూడు నుంచి 5 శాతం అద్దె పెంపు ఉంటుందన్నారు. జిల్లాకు చెంది తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఎస్సీ కుల ధ్రువీకరణ, పదో తరగతి పాసై, వయసు 25-60, నిరుద్యోగులైన అభ్యరులను ఎంపిక చేస్తారు. దరఖాస్తులు ఈ నెల 25 నుంచి నవంబరు ఒకటి లోగా ఎస్సీ కార్పొరేషన్‌లో సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.

వేతనాలకు ఏఎంసీ సీనియర్ రెసిడెంట్స్ ఎదురుచూపు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని సీనియర్ రెసిడెంట్లకు మూడు నెలలుగా గౌరవ వేతనం చెల్లించలేదు. జూలై, ఆగస్టు, సెప్టెంబరుకు సంబంధించి వేతనం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయంటున్నారు. సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కనిపించలేదని వాపోతున్నారు. ఏఎంసీ పరిధిలో వివిధ విభాగాలకు చెందిన 65 మంది సీనియర్ రెసిడెంట్స్ ఉన్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.80,500 చొప్పున గౌరవ వేతనంగా చెల్లిస్తోంది. మూడు నెలలుగా బడ్జెట్ విడుదల చేయకపోవడంతో సమస్య ఎదురైనట్టు చెబుతున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ సంధ్యాదేవిని వివరణ కోరగా బిల్లులు ట్రెజరీకి పంపించామని, కొద్దిరోజుల్లో నిధులు జమవుతాయన్నారు.

ఐటీకి విశ్వనగరంగా విశాఖ

» ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర

గాజువాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐటీకి విశ్వనగరంగా విశాఖపట్నం నిలుస్తుందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో గురువారం తెలుగు యువత, విద్యార్థులతో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టులను రాష్ట్రానికి తెచ్చిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడం గర్వకారణమన్నారు. యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కూటమి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో సాగుతోందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు.ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో ప్రముఖ ఐటీ సంస్థలు విశాఖ వైపు చూస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బొండా జగన్, రౌతు శ్రీనివాసరావు, లేళ్ల కోటేశ్వరరావు, బొడ్డు నరసింహపాత్రుడు, తెలుగు యువత నాయకులు మొల్లి పెంటిరాజు, ఎం.గణపతి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సురక్ష యాప్ ప్రారంభం

కూర్మన్నపాలెం: కల్తీ మద్యంపై ప్రభుత్వం రాజీ లేని పోరాటం చేస్తోందని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కూర్మన్నపాలెంలో గురువారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఏపీ మద్యం సురక్ష యాప్‌ను ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం మద్యం కుంభకోణాల్లో చేసిన పాపాలను, అక్రమాలను కూటమి ప్రభుత్వంపై నెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. వినియోగదారుల భద్రత కోసం ప్రతి మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్ ను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా దానిని స్కాన్ చేసి కల్తీదా కాదా తెలుసుకోవచ్చన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో 13 రకాల టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటుచేసి ప్రతి బ్యాచ్ మద్యం నమూనాలను పరిశీలించే విధానాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు.


మద్యం సురక్ష యాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు

మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు

» జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం పీఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన అంశాలపై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి స్టీరింగ్ కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వాలిటీ, క్వాంటిటీలో రాజీ పడకూడదన్నారు. ఎంపీడీవోలు, హెడ్‌మాస్టార్లు, ఇతర అధికారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. బీసీ, ఎస్టీ హాస్టల్స్‌లో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నదీ లేనిదీ చూడాలన్నారు. వైద్యాధికారులు స్కూల్స్‌ను తనిఖీ చేసి మందులు అందించాలన్నారు. మండల విద్యాశాఖ అధికా రులు సమన్వయంతో వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని సివిల్‌సప్లై అధికారులను ఆదేశించారు. పథకానికి సరఫరా చేసే కోడి గుడ్లకు మొదటి వారంలో నీలం రంగు, రెండో వారంలో పింకు రంగు , మూడో వారంలో పచ్చ రంగు, నాలుగో వారంలో బ్రౌన్ కలర్ స్టాంపును వినియోగించాలన్నారు. అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు ప్రతిరోజూ అందిస్తున్న భోజన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పి.జగదీశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఎఫ్‌సీఐ అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో స్టాఫ్ నర్సు ఖాళీలను భర్తీచేయాలి


వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): కేజీహెచ్‌లో ఖాళీగా ఉన్న 108 స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి గురువారం విన్నవించారు. ఆస్పత్రిలో 34 హెడ్ నర్సు, పది రెగ్యులర్ స్టాఫ్, 43 కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు, ట్రామా కేర్‌లో 21 కాంట్రాక్ట్ నర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీనివల్ల రోగులకు అందించే సేవలపై ప్రభావం పడుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ ఉద్యగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి. రాజశేఖర్ రెడ్డి, ఏపీ జీఈఏ నర్సింగ్ వింగ్ ప్రతినిధులు వి ఉషాకుమారి, జైతు రవీంద్రనాథ్ మాట్లాడుతూ వెంటనే పోస్టులను భర్తీ చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. సమస్యను రాష్ట్రస్థాయి అధికారు ల దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు.


పటేల్ ఆశయ సాధనకు కృషిచేయాలి: ఎంపీ శ్రీభరత్


యూనిటీ మార్చ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

బీచ్ రోడ్డు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. పటేల్ జయంతి సందర్భంగా గురువారం బీచ్ రోడ్డులోని యూత్ హాస్టల్‌లో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ కార్యక్రమంలో భాగంగా యూనిటీ మార్చ్ పేరుతో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బ్రిటీషర్ల వ్యూహాన్ని చిత్తుచేసి పటేల్ ప్రతిభను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తొలి ఉప ప్రధాని, హోం మంత్రి, సమాచార శాఖ మంత్రిగా దేశ నిర్మాణ బాధ్యతలు చేపట్టారన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఏర్పడ్డ అనిశ్చితిని, అనైక్యతను పటేల్ పరిష్కరించారన్నారు. జర్మనీ ఏకీకరణలో బిస్మార్క్ పాత్ర ఎలాంటిదో దేశంలో స్వదేశీ సంస్థానాల విలీనంలో పటేల్ ఉక్కు సంకల్పం అలాంటిదని కొనియాడారు. కశ్మీర్, జునగఢ్, హైదరాబాద్ మినహా మిగిలినవి బేషరతుగా భారత్‌లో అంతర్భాగమయ్యాయన్నారు. విద్య, ఉపాధి శిక్షణ ఆరోగ్య సేవలందించేందుకు కేంద్రం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్‌పై జగన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

» విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఏర్పాటుకానున్న గూగుల్ డేటా సెంటర్‌పై పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విజయనగరం లోక్‌సభ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డేటా సెంటర్‌పై జగన్ వ్యాఖ్యలు ఆంధ్రులు తలదించుకునేలా ఉన్నాయన్నారు. కత్తులు పట్టుకున్న వారికి కంప్యూటర్ల గురించి ఏమి తెలుసునన్నారు. అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. విశాఖకు గూగుల్ రావడం ఇష్టం ఉందా?, లేదా?...అనేది జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబును చూసి పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువస్తుంటే, జగన్ అండ్ కో మాత్రం ఇక్కడకు రావద్దని ఆయా కంపెనీలకు మెయిల్స్ పెడుతున్నారని ధ్వజమెత్తారు.

డైట్‌లో లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (భీమిలి డైట్)లో ఖాళీగా ఉన్న సీనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీ ప్రభుత్వ/ జిల్లా పరిషత్/ మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తున్న స్కూలు అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. తెలుగు (3), సోషల్ (3), ఫిజికల్ ఎడ్యుకేషన్ (1), ఆర్ట్ ఎడ్యుకేషన్ (1) ఖాళీలు ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఎడ్ చేసి ఉండాలన్నారు. 2025, అక్టోబరు 31 నాటికి అసిస్టెంట్ క్యాడర్‌లో కనీసం ఐదేళ్లు పూర్తి చేసి ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తులు పంపాలన్నారు. నవంబరు 5 నుంచి 8వరకు రాత పరీక్ష, 14, 15 తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

రుషికొండలో నిలిచిన బోటు షికారు

సాగర్‌నగర్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పర్యాటకాభివృద్ధి సంస్థ రుషికొండలో నిర్వహిస్తున్న బోటుషికార్ వాతావరణం అనుకూలించక గురువారం నిలిచిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా బోటుషికార్ నిలిపివేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అధికసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చే అవకాశం ఉండడంతో వాతావరణం అనుకూలించిన వెంటనే తిరిగి ప్రారంభిస్తామన్నారు.

స్టేషన్‌లో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సాయంత్రం 4.30 గంటల సమయంలో గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలును ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాంపై ప్లేస్‌మెంటు చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఏడో నంబరు ప్లాట్‌ఫామ్ ట్రాక్‌పై నుంచి వచ్చి రైలు ఇంజన్ వద్ద అడ్డంగా పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

త్రిశూల్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

» వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్


పనులు పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

సిరిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్టును రానున్న శివరాత్రి నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు వేగవంతం చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలసి గురువారం ఆయన కైలాసగిరిపై పనులను పరిశీలించారు. సుమారు 65 అడుగల మేర రూ.3.5 కోట్ల ఖర్చుతో దీనిని నిర్మిస్తున్నందున, నగరం నలుమూలల నుంచి కనిపిస్తుందన్నారు. ఆయన వెంట అదనపు కమిషనర్ కె.రమేశ్, ప్రధాన ఇంజనీరు వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీశంకర్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అత్యంత సుందర నగరంగా తీర్చిదిద్దండి

» పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్, పాల్గొన్న కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నవంబరు 14, 15 తేదీల్లో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు నగరాన్ని సుందరీకరించాలని, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. భాగస్వామ్య సదస్సుకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఏయూ వీసీ రాజశేఖర్, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లతో కలిసి వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏర్పాట్లను వివరించారు. సిటీ బ్యూటిఫికేషన్ కమిటీ ఏర్పాటు చేశామని, అవసరమైన చోట కొత్తగా రోడ్లు వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ భాగస్వామ్య సదస్సుకు దేశ విదేశాల నుంచి అతిథులు, వ్యాపారవేత్తలు వస్తారని ఈ మేరకు ఏర్పాట్లు ఘనంగా ఉండాలన్నారు.

లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు


క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

మురళీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఎయిర్‌పోర్ట్ వద్ద గురువారం తెల్లవారు జామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి... అమలాపురం నుంచి విశాఖ వస్తున్న ఆర్టీసీ బస్సు ఎయిర్‌పోర్టు వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో బస్సులోని ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. 108 వాహన సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

ఎండాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో ఇద్దరిని సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్టుచేసి,రిమాండుకు తరలించారు. ఎక్సేంజ్ 666 ఆన్‌లైన్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలానికి చెందిన మాసారపు దక్షిణామూర్తి (35), చుక్కా రఘురామ్ (26)ను అరెస్టు చేసి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.